# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :41 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: మంగళవారం 02-04-2024 | పేజీలు:4 వెల: 2.00


## దంచికొడుతున్న ఎండలు..

నల్లగొండ,ఏప్రిల్1: రాష్ట్రంలో ఎండలు దంచికొడుతున్నాయి. ఇప్పటికే పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 43 డిగ్రీల గరిష్టానికి చేరుకున్నాయి. సూర్యుడి ప్రతాపంతో ఉదయం నుంచే ఉక్కపోత మొదలవుతున్నది. పొద్దున 9 గంటలకే భానుడు భగభమంటున్నాడు. రాబోయే 5 రోజులపాటు ఉష్ణోగ్రతలు మరింత తీవ్రంగా ఉంటాయని హైదరాబాద్ వాతారణ కేంద్రం తెలిపింది. 15 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది. ఉత్తర తెలంగాణ జిల్లాలకు వడగాడ్పుల ముప్పు అధికంగా ఉంటుందని పేర్కొంది. నల్లగొండ జిల్లాలోని శివన్నగూడెంలో అత్యధికంగా 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. మరో రెండు రోజుల్లో ఉష్ణో గ్రతలు 44 డిగ్రీలకు చేరే అవకాశం ఉన్నట్టు అధికారులు తెలిపారు. కాగా, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబ్ నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల, నాగర్ కర్నూల్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీచేశారు.

## కడియం శ్రీహరి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి



వరంగల్ : స్టేషన్ ఘన్‌పూర్ నుంచి అసెంబ్లీకి ఎన్నికైన కడియం శ్రీహరి తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కడియం శ్రీహరికి గట్టిగా గుణపాఠం చెప్పాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వరంగల్ పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశంలో హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు.కడియం శ్రీహరి బీఆర్ఎస్‌ను వీడిన తర్వాత కార్యకర్తల్లో జోష్ ఎక్కువగా కనబడుతోంది. కసి ఎక్కువగా కనబడుతోంది. స్టేషన్ ఘన్‌పూర్ ఉప ఎన్నికలో పని చేసిన ఉత్సాహం ఇవాళ మీలో కనబడుతోంది. పార్టీకి ద్రోహం చేసిన కడియం శ్రీహరికి గట్టిగా గుణపాఠం చెప్పాలనే కసి కార్యకర్తల్లో కనబడుతుంది. ఆయన బిడ్డకు ఎంపీ టికెట్ తీసుకుని, అందరితో సమావేశాలు పెట్టించి చివరి క్షణంలో పార్టీ మారారు. ఇలాంటి ద్రోహులకు గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు హరీశ్‌రావు.

### శ్రీహరికి ఏం తక్కువ చేయలేదు..

పార్టీ మారడమంటే కార్యకర్తల మనోస్థైరాన్ని దెబ్బతీయడం, పార్టీని అవమానపరచడమేనని హరీశ్‌రావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీలో శ్రీహరికి ఏం తక్కువ చేయలేదు. డిప్యూటీ సీఎంగా, ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీ, ఎంపీగా అవకాశాలు ఇచ్చింది పార్టీ. ఆయన జీవితాంతం రుణపడి ఉన్న కూడా పార్టీకి తక్కువే. పార్టీ మారేది లేదు.. బీఆర్ఎస్‌లోనే ఉంటానని పలు వేదికలపై చెప్పారు. అవసరమైతే రాజకీయాల నుంచి తప్పుకుంటాను కానీ పార్టీ మారనని పలు ఇంటర్వ్యూల్లో చెప్పారు. ఇప్పుడు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. నీతి, నిజాయితీ, విలువలు ఉంటే.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు.

### దొంగతో కాంగ్రెస్ కండువా కప్పించుకున్నాడు..

పలు సందర్భాల్లో కడియం శ్రీహరి రేవంత్ రెడ్డిని దొంగతో పోల్చారు. సెక్రటేరియట్‌లో లంకె బిందెలు ఉన్నాయనకున్న రేవంత్ మాటలకు కడియం కౌంటర్ ఇచ్చారు. రేవంత్ ఓ దొంగ అని తీవ్ర విమర్శలు చేసిన కడియం.. ఇవాళ అదే దొంగతో కాంగ్రెస్ కండువా కప్పించుకున్నాడు. ఈ వయసులో ఇంత దిగజారుడు రాజకీయాలు అవసరమా..? అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

### బీఆర్ఎస్ తప్పకుండా అధికారంలోకి వస్తుంది..

కేసీఆర్ తెలంగాణ ఉద్యమం ప్రారంభించిన నాడు పట్టుమని పది మంది లేరు. జయశంకర్ సార్ దీవెనతో ఉద్యమాన్ని ప్రారంభించి, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు కేసీఆర్. కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ తప్పకుండా అధికారంలోకి వస్తుంది. చరిత్ర చూస్తే కాంగ్రెస్ గవర్నమెంట్ ఏ రాష్ట్రంలో కూడా ఐదేండ్లు కంటే ఎక్కువ లేదు. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఐదేండ్లు మాత్రమే ఉంది. హిమాచల్ ప్రదేశ్‌లో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి ఉందన్నారు హరీశ్‌రావు.

## అధికారంలో ఉన్నవాళ్లు మాటలతో ఎక్కువ రోజులు దృష్టి మరల్చలేరు



హైదరాబాద్: రాష్ట్రంలో రైతుల పరిస్థితి చూస్తుంటే కన్నీళ్లు వస్తున్నాయని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో రాష్ట్రమంతటా పంటలు ఎండిపోతున్నాయని విమర్శించారు. సాగునీరు ఇవ్వకుండా ప్రభుత్వం చోద్యం చూస్తున్నదని ఆగ్రహంవ్యక్తంచేశారు. రైతులు పంటలు తగులబెట్టుకుంటుంటే బాధ కలుగుతుందన్నారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కష్టపడి సాగుచేసిన రైతు తన పొలాన్ని తగులబెట్టుకునే దుస్థితి దాపురించిందన్నారు. కాంగ్రెస్ మంత్రులు, నేతలు రైతుల దగ్గరికి ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. రైతుల దగ్గరికి వెళ్లే ధైర్యం కాంగ్రెస్ మంత్రులు, నేతలకు లేదని విమర్శించారు.కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అదనంగా ఏదో వస్తుందని ఆశపడ్డామని రైతులు ఆవేదన చెందుతున్నారని చెప్పారు. హోల్‌సేల్‌గా కాంగ్రెస్ మోసం చేస్తుందనుకోలేదని బాధపడుతున్నారని పేర్కొన్నారు. రైతులకు వ్యతిరేకంగా మంత్రి తుమ్మల మాట్లాడటం బాధకలిగిందని వెల్లడించారు. ఆత్మవంచన చేసుకొని ఎందుకు మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. మంత్రిని చూస్తే జాలేస్తున్నదని, ఎవరిని మెప్పించడానికి పాట్లుపడుతున్నారని అడిగారు. ఉద్యమం సమయంలో చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డి సీఎంలుగా ఉన్నపుడు వాళ్ల దృష్టిలో పడటానికి కేసీఆర్‌ను ఇంతకంటే ఎక్కువగా తిట్టారని విమర్శించారు. తర్వాత కేసీఆర్ దగ్గరికి వచ్చి మంత్రివర్గంలో పనిచేసి ఇప్పుడు మళ్లీ పక్క పార్టీలోకి పోయి తిడుతున్నారని చెప్పారు. ఇలాంటివి ఎన్నో చూశాం, ఎంతో మందిని చూశాం.. అమావాస్య తర్వాత పౌర్ణమి వస్తుంది. అన్ని అమావాస్యలు మావి కావు, అన్ని పౌర్ణమిలు మీవి కావన్నారు.గత ప్రభుత్వ హయాంలో రైతులకు చేసినవన్నీ తుమ్మలకు తెలుసన్నారు. చేతనైతే రైతు భరోసా రూ.15 వేలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. తాము చేసినదానికంటే రైతులకు ఎక్కువ మేలు చేయాలని సూచించారు. కేసీఆర్, కాళేశ్వరం ప్రాజెక్టుపై బురద చల్లే దుర్బుద్ధే కనిపించిందని విమర్శించారు. రైతులకు నీళ్లు ఇవ్వాలన్న సోయి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదన్నారు.ఉత్తర తెలంగాణలో సగటుకంటే ఎక్కువ వర్షపాతం నమోదయిందని, దక్షిణ తెలంగాణలో వర్షపాతం కొంచెం తక్కువ ఉందని చెప్పారు. చరిత్రలో ఎన్నడూ లేనంత వరద గోదావరిలో గత వర్షాకాలంలో వచ్చిందన్నారు. అత్యధిక వరద వల్లనే మేడిగడ్డ బరాజ్‌లో రెండుమూడు పిల్లర్లకు నష్టం కలిగిందని చెప్పారు. ఇప్పుడు ఎత్తిపోస్తున్న నీళ్లే రెండు నెలల కింద ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువని ఆరోపించారు. కాంగ్రెస్‌కు పాలన చేతగాక మందిమీద నిందలు వేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారంలో ఉన్నవాళ్లు మాటలతో ఎక్కువ రోజులు దృష్టి మరల్చలేరన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కరువుకు కేరాఫ్‌గా కాంగ్రెస్ పాలన ఉండేదని, నిబద్ధత ఉంటే రైతు దశ మార్చవచ్చని కేసీఆర్ నిరూపించారని తెలిపారు. వ్యవసాయం చేయొచ్చని రైతులకు కేసీఆర్ భరోసా కల్పించారని చెప్పారు.

## ఇరిగేషన్ రంగాన్ని సర్వనాశనం చేసిన కెసిఆర్



హైదరాబాద్,ఏప్రిల్1: కెసిఆర్ హయాంలో ఇరిగేషన్ రంగం సర్వనాశనం అయ్యిందని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఇరిగేషన్ రంగంలో కేసీఆర్ చేసిన దోపిడీ దేశంలో ఎవరూ చేయలేదన్నారు. జనగామ, సూర్యపేట జిల్లాలో కేసీఆర్ పర్యటించి, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శస్తూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి ఉత్తమ్ కౌంటర్ ఇచ్చారు. నిన్న కేసీఆర్ అన్ని అబద్దాలే మాట్లాడారని మండిపడ్డారు. గాంధీ భవన్‌లో ఉత్తమ్ మీడియాతో మాట్లాడుతూ.. ఉమ్మడి ఏపీ కంటే కేసీఆర్ హయాంలో తెలంగాణకు ఎక్కువ ద్రోహం జరిగిందన్నారు. పోలీస్ శాఖను ఎక్కువ మిస్ యూజ్ చేసింది కేసీఆరే అని విమర్శించారు. పోలీసులు న్యూట్రల్‌గా ఉండాలని ఇప్పుడు కేసీఆర్ చెప్పడం హాస్యాస్పదమన్నారు. కరువు వచ్చింది బీఆర్ఎస్ పాలనలోనే అని... దాన్ని సమర్థవంతంగా డీల్ చేస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ పేర్కొన్నారు.బీఆర్ఎస్ సర్కార్ హయాంలో రైతులకు పంట బీమా కల్పించలేదని.. .దేశంలో పంట బీమా కల్పించని ఏకైక సర్కార్ బీఆర్ఎస్ దేనని విమర్శించారు. వరదలు, కరువుతో పంట నష్టపోతే.. ఒకటి రెండు చోట్లకు వెళ్లి కేసీఆర్ డ్రామా చేశాడని.. ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని దుయ్యబట్టారు. మైక్ పనిచేయకుంటే కరెంట్ పోయిందంటూ కేసీఆర్ అబద్దాలు మాట్లాడారని.. పవర్ విషయంలో బీఆర్ఎస్ చేసిందేమీ లేదన్నారు. 24 గంటల పవర్ పాలసీని కొనసాగిస్తున్నాం.. రాష్ట్రంలో పవర్ కట్స్ లేవని స్పష్టం చేశారు.కాళేశ్వరం గురించి మాట్లాడటానికి కేసీఆర్‌కు సిగ్గుండాలి. తలదించుకోవాలి.. ముందు తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. కాళేశ్వరంలో కమిషన్ల కోసం అంచనాలు పెంచారని చెప్పారు. కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పజెప్పిందే కేసీఆర్ అని నిప్పులు చెరిగారు. కేసీఆర్, జగన్ దోస్తీతో తెలంగాణకు అన్యాయం జరిగిందని.. కృష్ణా నుంచి జగన్ అక్రమంగా నీళ్లను తరలిస్తున్నా కేసీఆర్ నోరు మెదపలేదని ఉత్తమ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కంటే కేసీఆర్ హయాంలోనే ఏపీకి ఎక్కువ నీళ్లు తరలి వెళ్లాయన్నారు. కేసీఆర్ భయాందోళనలో ఉన్నాడు.. అందుకే పొలం బాట పట్టారని చెప్పారు. కేసీఆర్ పొంకనాలకు పోయి పార్టీని నాశనం చేశాడని విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్లలోనే కుప్పకూలిందని.. పార్లమెంట్ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో బీఆర్ఎస్ కనుమరుగవుతుందని మంత్రి ఉత్తమ్ చెప్పారు.

ఇన్ని మాటలు మాట్లాడుతున్న కెసిఆర్ బిఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు పంట బీమా ఎందుకు కల్పించలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అడిగారు. దేశంలో పంట బీమా కల్పించని ఏకైక ప్రభుత్వం బిఆర్ఎస్సేనని ధ్వజమెత్తారు. పార్లమెంటు ఎన్నికల తరువాత బిఆర్ఎస్ కనుమరుగుకావడం ఖాయమని జోస్యం చెప్పారు. 24 గంటల పవర్ పాలసీ కొనసాగిస్తున్నామని, నిమిషం పవర్ కట్స్ ఎక్కడా లేవన్నారు. తెలంగాణ రైతాంగం, ఇరిగేషన్‌ను సర్వనాశనం చేసి వ్యక్తి కెసిఆర్ అని, అందుకు ఆయన సిగ్గుపడాలి, తలదించుకోవాలి, తెలంగాణ జనాలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇరిగేషన్ రంగాన్ని కెసిఆర్ నాశనం చేయడంతో పాటు దోపిడీ చేశారని ఆరోపణలు చేశారు. కాళేశ్వరం గురించి మాట్లాడేందుకు కెసిఆర్‌కు సిగ్గుండాలని, కాళేశ్వరంలో కమీషన్ల కోసం అంచనాలు పెంచారని, కళ్ల ముందే కాళేశ్వరం కుంగినా మాట్లాడటం మూర్ఖత్వం కిందకు వస్తుందని ఉత్తమ్ ధ్వజమెత్తారు. కేసీఆర్ మాట్లాడిన ప్రతి మాట అబద్ధమే అని.. ఆయన డిప్రెషన్, ఫ్రస్టేషన్‌లో ఉన్నారంటూ వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్, ఆయన కుటుంబసభ్యులు తప్ప బీఆర్ఎస్‌లో ఎవరూ మిగలరన్నారు. పదేండ్లలో పంట నష్టం జరిగితే కేసీఆర్ రూపాయి కూడా ఇవ్వలేదని గుర్తుచేశారు. ఇరిగేషన్‌పై మాట్లాడే అర్హత కేసీఆర్‌కు లేదన్నారు. ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పచెప్తామని బీఆర్ఎస్ చీఫ్ ఒప్పుకున్నారని గుర్తుచేశారు. కేసీఆర్ – జగన్ కలిసి ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాలపై కుట్ర చేశారని ఆరోపించారు.

## ఎంపీ సీట్ల కోసం కేసీఆర్ మొసలి కన్నీరు.. మంత్రి శ్రీధర్ బాబు



పెద్దపల్లి, రైతుల పేరిట ప్రతిపక్షాలు రాజకీయాలు చేయొద్దని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుదిళ్ల శ్రీధర్ బాబు హితువు పలికారు. సోమవారం జిల్లా కేంద్రమైన పెద్దపల్లిలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యం వల్ల రాష్ట్రంలో కొంత పంట నష్టం జరిగితే పార్లమెంటు ఎన్నికల్లో లబ్ది పొందేందుకు బిఆర్ఎస్ రాజకీయం చేయడం సిగ్గుచేటు అన్నారు.అధికారంలో ఉన్న పది సంవత్సరాలపాటు రైతుల ను పట్టించుకోని కేసీఆర్ ఎంపీ సీట్ల కోసం దొంగ కన్నీరు కారుస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. టేలండ్ ప్రాంత రైతులు పంట నష్టపోకుండా ఉండేందుకు తమ ఎమ్మెల్యేలు కృషి చేస్తున్నామన్నారు. కాలేశ్వరం ప్రాజెక్టుతో మంథని ప్రాంతానికి చుక్క నీరు కూడా రాలేదని, మూడు పిల్లర్లు కుంగిపోయి ప్రాజెక్టు ఉనికికి ప్రమాదం ఏర్పడిందని ఈ పాపం గత ప్రభుత్వానిది కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో విద్యుత్ కొరత లేకుండా ఉండేందుకు గత ప్రభుత్వం ఫిబ్రవరి, మార్చ్ మాసాల్లో వినియోగించిన కరెంట్ కంటే ఎనిమిది శాతం అధికంగా కరెంటు కొనుగోలు చేసి మరీ సరఫరా చేస్తున్నామన్నారు.రాష్ట్రంలో ఎటువంటి విద్యుత్ కొరతలు లేవని, ప్రతిపక్షాలు అసత్యపు ప్రచారాలు చేస్తున్నాయని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికి జీరో బిల్లు అందిస్తామన్నారు. సాంకేతిక సమస్యలతో జీరో బిల్లు రాకుంటే సంబంధిత ఎంపీడీవో కార్యాలయం తో పాటు మున్సిపల్ కార్యాలయంలో సవరణ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడుకున్న వినియోగదారులు బిల్లులు కట్టాల్సిన అవసరం లేదని, బిల్లు కట్టకుండా వారి సరఫరాను విద్యుత్ శాఖ సిబ్బంది తొలగించకుండా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ప్రకృతి వైపరీత్యం వల్ల కొంత పంట నష్టం జరిగిందని, నిజంగా పంట నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తమ ప్రభుత్వం పక్కాగా అమలు చేస్తుందన్నారు. ఉచిత బస్సు ప్రయాణంలో భాగంగా ఇప్పటికే 35 కోట్ల ఫ్రీ టికెట్లు జారీ చేశామన్నారు. 500 రూపాయలకే సిలిండర్ అందిస్తున్నామని, ఆరోగ్యశ్రీని 10 లక్షల రూపాయలకు పెంచామని పెద్దపెల్లి జిల్లాలో 15 కోట్ల రూపాయల వైద్య సేవలను ప్రజలు వినియోగించుకున్నారన్నారు. ఎన్నికల తర్వాత పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడతామని ఆరు గ్యారెంటీలో ప్రతి పథకానికి పూర్తిస్థాయిలో నిధులు కేటాయిస్తామన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసిందని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఐదు సంవత్సరాలలోపు ప్రతిపాక రిజర్వాయర్ను పూర్తి చేస్తామన్నారు.సమాజంలో నాలుగో పిల్లర్ గా ఉన్న జర్నలిస్టులకు ఎన్నికల ముఖ్యగానే ఇంటి స్థలాలు, ఇండ్ల మంజూరు పై నిర్ణయం తీసుకుంటామన్నారు. ఫోన్ టాపింగ్ అతిపెద్ద నేరమని, చట్టానికి ఎవరూ అతీతులు కారని తప్పు చేసిన వారు శిక్ష అనుభవించక తప్పదు అన్నారు. మేము ఆరోపిస్తే కాంగ్రెస్ ఆరోపిస్తుందని గగ్గోలు పెడతారని, కానీ బారాస పార్లమెంటు అభ్యర్థి కడియం కావ్య లిక్కర్ స్కాం ఫోన్ టాపింగ్ ఇతర అవినీతి ఆరోపణలపై ప్రజలకు జవాబు చెప్పలేకపోతున్నామని పోటీ నుండి తప్పుకొని కాంగ్రెస్ పార్టీలో చేరారన్నారు. మీడియా సమావేశంలో పెద్దపెల్లి రామగుండం ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్సింగ్ తో పాటు కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

## వచ్చేయ్ ఆ మాటలు మేం పట్టించుకోం!



హైదరాబాద్,రాజకీయాల్లో ఏదైనా సాధ్యమే. అప్పుడే తిట్టుకున్న వారు మరుసటి రోజే మిత్రులుగా మారొచ్చు. బద్ధ శత్రువులు కూడా భుజాలు కలుపుకుని తిరగొచ్చు. ఇప్పుడు వరంగల్ రాజకీయం పలు మలుపులు తిరుగుతోంది. ఇక్కడ నుంచి మొదట బీఆర్ఎస్ అభ్యర్థిగా కడియం శ్రీహరి కూతురు కావ్యను తమ పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించారు. కానీ ఆమె కాంగ్రెస్ లోకి వెళుండటంతో నాటకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. కడియం కావ్య హ్యాండ్ ఇవ్వడంతో బీఆర్ఎస్ నేతల్లో బెంగ పట్టుకుంది. స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గంలో కడియం శ్రీహరి, తాటికొండ రాజయ్య ఇద్దరికి ఎమ్మెల్యే టికెట్ విషయంలో గొడవ జరిగినప్పుడు బీఆర్ఎస్ అధిష్టానం కడియం శ్రీహరికే మొగ్గు చూపింది. ఆయనకే టికెట్ కేటాయించింది. దీంతో రాజయ్య కేటీఆర్ పై తీవ్ర విమర్శలు చేశారు. తనకు అన్యాయం చేశారని అక్కసు వెళ్లగక్కారు. అప్పుడే రాజయ్య కాంగ్రెస్ లో చేరాలని భావించినా రేవంత్ రెడ్డి అనుమతి ఇవ్వలేదు. దీంతో ఆయన చేరిక ఆలస్యం అయింది. ఇప్పుడు వరంగల్ లోక్ సభ స్థానం బరిలో కడియం కావ్యను రంగంలోకి దింపినా గెలిచే సత్తా లేదని తెలుసుకుని కావ్య మనసు మార్చుకుని కాంగ్రెస్ వైపు మొగ్గు చూపింది. దీంతో బీఆర్ఎస్ నేతలు కడియంపై తీవ్ర విమర్శలు చేసింది. ఇక తాటికొండ రాజయ్యను పార్టీలోకి రావాల్సిందిగా ఆహ్వానించింది. వరంగల్ లోక్ సభ టికెట్ ఇస్తామని చెప్పడంతో రాజయ్య చేరిక ఖాయమైంది. ఇలా పరస్పరం తిట్టుకున్న వారే ఇప్పుడు ఒకటిగా మారిపోయారు. మా అప్తుడు అనుకున్న కడియం శ్రీహరి పార్టీకి శఠగోపం పెట్టడంతో బీఆర్ఎస్ లో అంతర్మథనం మొదలైంది. ఇలా పార్టీకి పంగనామాలు పెట్టిన శ్రీహరిని అదను చూసి దెబ్బకొట్టాలని చూస్తోంది. ఇందులో భాగంగానే తాటికొండ రాజయ్యకు టికెట్ ఇచ్చి కడియం దూకుడుకు పగ్గాలు వేయాలని భావిస్తోంది. తాటికొండ రాజయ్య చేరికను వ్యతిరేకించే వారు లేరు. ప్రస్తుత పరిస్థితుల్లో అందరు పార్టీని వీడి వెళ్లిపోతున్న తరుణంలో రాజయ్య పార్టీకోసం పని చేసేందుకు రావడమే వారికి ప్రధాన బలంగా చెప్పుకుంటున్నారు.

## రుణమాఫీ అయితే కాంగ్రెస్ కు ఓటు వేయండి లేకపోతే మాకు వేయండి



హైదరాబాద్: బిఆర్ఎస్ కార్యకర్తలు ఉత్సహం చూస్తే ఎందుకు ఓడిపోయామో అర్థం కావడంలేదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. నల్లగొండలో జరిగిన సభలో కెటిఆర్ మాట్లాడారు. మనది పదేళ్ల నిజం అని, కాంగ్రెస్‌ది వంద రోజుల అబద్ధమని మండిపడ్డారు. రైతులకు 24 గంటలు రైతులకు కరెంటు, చివరి ఆయకట్టుకు నీళ్లిచ్చిన నాయకుడు కెసిఆర్ అని ప్రశంసించారు. నల్లగొండలో ఫ్లోరైడ్‌ని పెంచిందే కాంగ్రెస్ అని, ఫ్లోరైడ్ భూతాన్ని తరిమికొట్టింది కెసిఆర్ కాదా? అని ప్రజలను కెటిఆర్ అడిగారు. బిఆర్ఎస్ ప్రభుత్వం వెయ్యి గురుకుల పాఠశాలలు పెట్టిందని, ఇవన్నీ ప్రజలకు చెప్పడంతో మన విఫలమయ్యామని, తప్పు ప్రజలది కాదని, మనదేనని, కాంగ్రెస్ చెప్పిన అబద్ధాలు విని ప్రజలు మోసపోయారన్నారు. ఇవాళ ప్రజలు, రైతులు బాధ పడుతుంటే చూడలేకపోతున్నామన్నారు.బిఆర్ఎస్ ప్రభుత్వంలో 1,60,283 ఉద్యోగాలు ఇచ్చామని కెటిఆర్ స్పష్టం చేశారు. ఆ విషయాన్ని విద్యార్థులు, నిరుద్యోగులకు చెప్పడంలో తాము విఫలమయ్యామన్నారు. దేశంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు భర్తీ చేసింది బిఆర్ఎస్సేనని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 30 వేల ఉద్యోగాలు ఇచ్చామంటున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదని, నోటిఫికేషన్ లేకుండా ఉద్యోగాలు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. వంద రోజుల్లోనే మోసపోయామని ప్రజలు గ్రహించారని, రెండు లక్షల రూపాయల రుణమాఫీ ఇంకా ఎందుకు చేయలేదని కెటిఆర్ ప్రశ్నించారు. రుణమాఫీ జరిగి ఉంటే కాంగ్రెస్‌కు ఓటు వేయాలని సూచించారు.రుణమాఫీ రాక మోసపోయుంటే బిఆర్ఎస్‌కు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చాల్సిన అవసరం తమకు లేదని, నల్లగొండ, ఖమ్మం నేతలే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలుస్తారని ఎద్దేవా చేశారు. ఏక్‌నాథ్ శిండేలు కాంగ్రెస్‌లో ఉన్నారన్నారు. నల్లగొండ జిల్లాలో ఆదివారం కెసిఆర్‌కు ప్రజలు అద్భుత స్వాగతం పలికారని, ఆ అభిమానం చూస్తుంటే ఆశ్చర్యం కలిగిందని, నల్లగొండ జిల్లాలో ఎలా ఓడిపోయామో అర్థం కాలేదని, డిసెంబర్ 3న భిన్నంగా ఫలితాలు వచ్చాయని, మొన్న జరిగిన పొరపాటు మళ్లీ జరగకుండా చూసుకుందామన్నారు.

### ఆస్తి తగాదాలో తమ్ముడిపై అన్న దాడి

కామారెడ్డి,కామారెడ్డి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. ఆస్తి కోసం మానవ సంబంధాలను మరిచి తమ్ముడిపై అన్న, వదిన దాడి చేశారు. ఈ విషాదకర సంఘటన జిల్లాలోని దోమకొండ మండలం అంబారీపేటలో చోటు చేసుకుంది. ఆస్తి తగాదాల నేపథ్యంలో తమ్ముడి క్షౌరశాలకి వెళ్లి మరీ కత్తితో దాడి చేశారు. స్థానికులు వెంటనే క్షతగాత్రుడిని దవాఖానకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## సంపాదకీయం

**మంగళవారం 02-04-2024**

# జంప్ జిలానీలు..!


జిలానీ పుంలింగమే అవ్వాల్సిన పనిలేదు. లోక్‌సభకి నిలబెట్టిన తర్వాత అస్త్ర సన్యాసం చేసిన ఒక స్త్రీ మూర్తి, గత కొన్నేండ్లుగా జంటనగరాల మేయర్ పదవిపై సవారీ చేసిన మరొక మహిళా ఉన్నారు కాబట్టి 'జిలానీ' స్త్రీ లింగం కావాల్సిన పని కూడా లేదు. వస్తున్న పత్రికా కథనాల ప్రకారమైతే ఈ లిస్టు చాలానే ఉంటుందట. పదవుల చుట్టూ పోగేసిన జనం బెల్లం ముక్క జారిపడిపోయిన తర్వాత అక్కడికే ముసురుతారనే విషయం డిసెంబరు ఏడు నాడే అర్థమయిందనుకుంటా. రేవంత్ సర్కార్ వారంలో పడిపోతుందనో, నెల్లో పడిపోతుందనో మళ్లీ కేసీఆర్ కుర్చీ ఎక్కబోతారని ఎన్ని జిమ్మిక్కులు చేసినా, ఎంత వాగాడంబరం ప్రదర్శించినా జనాన్ని ఆపుకోలేక పోతున్నారు బీఆర్ఎస్ నేతలు. ఆ కుండకు చిన్న చిల్లు పడుంటే వేలో, కాలో పెట్టి ఆపచ్చు. కాని దాన్నిండా కంతలే! ఎన్నని మూయగలరు? ఎందర్నని ఆపగలరు? జారిపోయేవారందర్నీ 'దీర్ఘదర్శులు'గా జమకట్టలేము. మహా అయితే చెరువు మొత్తం ఎండిపోయేలోపు, బయటికి దూకే 'ప్రాప్తకాలజ్ఞులే!' తెలంగాణ సాధనోద్యమం ప్రజలందర్నీ శాశ్వతంగా బంధించివుంచే 'సిమెంట్'కాదు. తెలంగాణ సాకారమైన తర్వాత వివిధ తరగతుల ప్రజలు తమ జీవితాల్లో ఏం మార్పులొచ్చాయో చూసుకోరా? కార్మికులకు కనీస వేతనాలు పెరగలేదు. రైతుల ఆత్మహత్యలు ఆగలేదు. నేతన్నల బతుకులు మారలేదు. ఉపాధి హామీ కూలీల జీవితాలను ఏనాడూ పట్టించుకోని బీఆర్ఎస్ సర్కార్ కౌలు రైతులు అసలు రైతులే కాదని ఢంకా బజాయించి చెప్పింది. ఉత్తర భారతదేశ స్థాయిలో కులోన్మాదం పడగవిప్పింది. కుదురహంకార హత్యలకు తెలంగాణ అడ్డాగా మారింది. వీటిపై నోరు మెదపదు బీఆర్ఎస్ నాయకత్వం. పైగా కనీసం విభజన చట్టం హామీల కొరకు ప్రజలందర్నీ సమీకరించి పోరాడిందీ లేదు. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీల విషయంలో మోడీ సర్కార్ ముందు మోకరిల్లింది అప్పటి రాష్ట్ర ప్రభుత్వం. హనీమూన్ కాలం ముగిసిన తర్వాత మన రాష్ట్రానికి రావల్సిన బకాయిలపై ఎంత యుద్ధం చేస్తే ఉపయోగమే ముంటుంది.ప్రస్తుతం పత్రికల వార్తలు చూస్తే జారిపోయే వారిని అధినేత బుజ్జగించే అంశాలు సైతం 'ఇంతకాలం ఇన్ని పదవులూ అనుభవించి (అంటే సంపాదించుకుని) ఇప్పుడు బయటకు పోవడం ఏం న్యాయమనే'! ఇక్కడ సిద్ధాంతాల్లేవు. డబ్బు చుట్టూనే ఆలోచన. 'ధనమూలం మిదం జగత్' అనేది!. వీరి కోసమే వచ్చిందేమో! అందుకే రాత్రికి రాత్రే కండువాలు మార్చుకుంటున్నారు. చొక్కాలు విప్పినంత తేలిగ్గా పార్టీలు మారుతున్నారు. దేశంలో పార్టీలను, ప్రభుత్వాలను లొంగదీసు కునేందుకు గవర్నర్లు, ఈడీలు, ఐటీలు, సీబీఐలు ఇష్టానుసారం వాడుకుంటూ ఇటీవలి సతీష్ ఆచార్య కార్టూన్ వేసినట్టు 'కమలం' గుర్తు వాషింగ్ మెషీన్‌లో వేస్తే అవినీతి నుండి శుద్ధి అయి కాషాయం రంగుతో పవిత్రంగా బయటికొస్తున్న స్థితి. దేశవ్యాపితంగా ఎందరో పెట్టుబడి దారులు కం వ్యాపారవేత్తలు కం రాజకీయ నేతలు ఈ బాపతు పార్టీల్లో కనపడుతున్నారు. అందుకే సర్వం డబ్బుమయంగా మారింది. వాళ్ళకు పార్టీలు, సిద్ధాంతాలు కాదు, తమ వ్యాపార సామ్రాజ్యాన్ని కాపాడుకోవడం కీలకం. బీజేపీ వంటి పార్టీలకు గొడ్డు మాంసం వ్యాపారం చేసే వాడైనా రూ. కోట్లు వెదజల్లగలిగేవాడైతే చాలు. అక్కున చేర్చుకుని టికెట్టిస్తాయి. దేశంలో పెరుగుతున్న పేదరికం ఈ పార్టీలకో వరం. నెలంతా చాకిరీ చేసినా నాలుగైదు వేల రూపాయలు సంపాదించడమే కష్టమైన పేదలకు ఒక రోజు ఓటుకు దానికి మించిన ధనం రావడం, దానికి అదనంగా వచ్చే ఇతరాంశాలు ఆ ఒక్క రోజుకైనా సంతృప్తిని స్తాయన్న గట్టి నమ్మకం.ఈ స్థితి శాశ్వతంగా కొనసాగదు. వర్గపోరు ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ రంగాల్లో తీవ్రంగావాలి. ఢిల్లీని గేరి వేసిన రైతు ఉద్యమం ఆనాడు హిందూ, ముస్లిం రైతాంగాన్ని ఐక్యంచేసింది. జాట్ చిక్కులను, దళిత కూలీలను చేయి, చేయి కలిపి రైతాంగ సమస్యలపై పోరుకు సిద్ధపడేలా చేసింది. వర్గ పోరే కేరళ వామపక్ష ప్రభుత్వాన్ని, సామాజిక, ద్రావిడ చైతన్యం తమిళనాట స్టాలిన్ సర్కార్‌ని కాపాడు కుంటున్నాయి. ఏమైనా రాష్ట్ర పరిణామాలు కాంగ్రెస్ కంటే బీజేపీకి ఆనందం కల్గించేవి. రాష్ట్రంలో ఒకేలాంటి విధానాలున్న రెండు పార్టీలే మిగలడం ప్రజలకు, ప్రజా ఉద్యమాలకు నష్టం.

# కేకే వివరించని విషయాలు...



హైదరాబాద్,రాజకీయాలలో విలువలు నానాటికీ మృగ్యమవుతూ అధికారం కోసం, డబ్బు కోసం ఎవరు ఎటైనా మారటం మరింత పెచ్చరిల్లుతున్న ఈ రోజుల్లో కనీసం కేశవరావు వంటి ప్రతిష్ట, విలువలు గల మేధావులు అయినా తమ పార్టీ మార్పిడికి తగిన కారణాలు చూపగలరని సాధారణ ప్రజలు ఆశిస్తారు. ఆయన బీఆర్ఎస్‌కు రాజీనామాను, కాంగ్రెస్‌లో ప్రవేశాన్ని ప్రకటించిన తర్వాత ఒక మీడియా సమావేశంలో, కొన్ని ఇంటర్వ్యూలలో మాట్లాడారు. కానీ, పార్టీ మారటానికి ఆయన చెప్పిన కారణాలలో సూటిదనం గానీ, నిజాయితీ గానీ కనిపించలేదు. పార్టీ మారటం తన స్వేచ్ఛ. కానీ, అందుకు కారణాలను తన వంటి స్థాయిగల వారి నుంచి దాపరికం లేకుండా తెలుసుకోవాలనుకోవడం ప్రజల హక్కు. ఆ హక్కును ఆయన స్పష్టంగా ఉల్లంఘించారు. ఆ విధంగా ప్రజాస్వామ్యం పట్ల ప్రజల విశ్వాస, గౌరవాలను తన వైపు నుంచి తాను మరింత తగ్గించారు. K. Keshava Rao రాజకీయవాదులు పార్టీలు మారటం చాలాకాలంగా ఉన్నది. అది ఎంతగా పెరుగుతున్నదో ప్రజలకు తెలంగాణతో పాటు దేశమంతటా కనిపిస్తున్నది. ఒకవేళ 'సాక్షి' సంపుటాల రచయిత పానుగంటి లక్ష్మీనరసింహారావు ఇప్పుడు జీవించి ఉంటే తన రాజకీయ వ్యంగ్య వైభవ రచనలకు తగిన సరంజామా లభిస్తున్నదని ఆనందించేవారో లేక ఈ వేగాన్ని అందుకోలేక సొమ్మసిల్లి పోయేవారో చెప్పలేం. నిజానికి ఈ పార్టీ ఫిరాయింపుల గురించి మామూలుగానైతే రాయవలసిన అవసరమే ఉండేది కాదు. మహా అయితే ఈ ధోరణి గురించి అందరినీ కలిపి ఒకసారి వ్యాఖ్యానించుకుంటే సరిపోయేది. కేశవరావును అందరితో జతగట్టలేం గనుకనే ఈ ప్రస్తుత రచన ఆయనకు జర్నలిస్టుగా, ఇతరత్రాగల అర్హతలను అటుంచి, ఒక విలువలు గల రాజకీయవాదిగా, సోషలిస్టు స్వాప్నికునిగా తనకు గల గుర్తింపు మూలంగా నాకు 1980లలో ఢిల్లీ రోజుల నుంచి తనతో మంచి పరిచయం. అది ఇప్పటివరకు చెక్కుచెదరలేదు. ఇప్పుడు ఆయన బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి అకస్మాత్తుగా, ఇప్పుడు నెలకొన్న పరిస్థితుల మధ్య మారినప్పటికీ ఆ గౌరవభావం తగ్గుతున్నదని కాదు. కానీ, అదే సమయంలో తనట్లా మారటానికి చెప్పిన కారణాలలో మాత్రం సూటిదనం, నిజాయితీ, స్పష్టత లోపించాయని మాత్రం అనక తప్పడం లేదు. అన్నీ ప్రజలకు చెప్పవలసిన అవసరం లేదని, అది తన ప్రైవసీ అని ఇతర రాజకీయవాదుల వలెనే తను కూడా అనదలుచుకుంటే అది ఆయన హక్కు.ఇప్పుడు కేకే చెప్పిన, లేదా చెప్పలేదని మనకు అనిపిస్తున్న విషయాలలోకి వెళదాం. ఎవరైనా ఈ మాట అంటే, ఆయన తన మేధావి ధోరణిలో 'చెప్పలేదనిపించటం వాళ్ల పెర్‌సెప్షన్. చెప్పాననుకోవటం నా పెర్‌సెప్షన్. వాళ్ల పెర్‌సెప్షన్‌ను కూడా నేను గౌరవిస్తాను' అని అనవచ్చు. ఈ రెండు రోజులలో ఇదే మాట తను మీడియాతో తరచూ అన్నారు కూడా. ఇది ఒక ఎడతెగని మేధో వివాదం కనుక దానిని అట్లుంచి, ఆయన ప్రజలకు వివరించకుండా వదిలివేసిన విషయాలలోకి వెళదాం. వాటి గురించి తెలంగాణ దృక్కోణం నుంచి, ప్రజల దృక్కోణం నుంచి అర్థం చేసుకోవలసిన విషయాలు ఉన్నాయి కనుక ఇదంతా రాసుకోవడం. ఒకవేళ ఈ చర్చ వల్ల ప్రశ్నలు మాత్రమే తలెత్తి, సమాధానాలు లభించనట్లయితే (అందుకే అవకాశాలు ఎక్కువ), ఆ పని చేయవలసిన బాధ్యత తిరిగి కేశవరావుపైనే ఉంటుంది.కేకేకు ఎదురైన ప్రధానమైన ప్రశ్న.. ఈ దశలో బీఆర్ఎస్‌ను వదిలి కాంగ్రెస్‌లోకి ఎందుకు వెళ్తున్నారన్నది. అందుకు ఆయన సమాధానాలు రెండు. కాంగ్రెస్‌ను వదిలి కొంతకాలం తీర్థయాత్రలు చేశాను. కాంగ్రెస్‌లో ఉండింది 50 ఏండ్లకు పైగా కాగా, బీఆర్ఎస్‌లో ఉన్నది పదేండ్లు. ఇప్పుడు ఈ వయసు (84)లో తీర్థయాత్ర ముగించుకుని తిరిగి సొంత ఇంటికి పోవాలనుకున్నాను. ఒకవైపు 50 ఏండ్లు, ఇంకోవైపు పదేండ్లు. ఇందులో 50 ఏండ్లది మొగ్గ అయింది, అనేది ఒక జవాబు. ప్రస్తుతం బీఆర్ఎస్ కష్టాల్లో ఉన్న మాట నిజం. కానీ కాంగ్రెస్ ఇంకా పెద్ద కష్టాల్లో ఉందనేది రెండవ జవాబు. ఇందుకు సంబంధించి మరొక ప్రశ్న.. బీఆర్ఎస్‌లో అనేక పదవులు అనుభవించి పోవటమేమిటంటే కాంగ్రెస్‌లో అంతకన్నా ఎక్కువ అనుభవించానన్నది సమాధానం. మొదటిసారి రాజ్యసభకు కాంగ్రెస్ మద్దతు వల్లనే గెలిచానని, రెండోసారి మాత్రమే బీఆర్ఎస్ బలంతోనని వివరణ.కేశవరావు కాంగ్రెస్‌ను వదిలి బీఆర్ఎస్‌లోకి వెళ్లడం తెలంగాణ ఉద్యమం అనే బలమైన కారణం వల్ల. దానిని తీర్థయాత్ర అంటున్నారు ఆయన ఇప్పుడు. రెండు పార్టీల మధ్య కాలాన్ని సంవత్సరాలలో కొలుస్తున్నారు. బీఆర్ఎస్ కన్నా కాంగ్రెస్ ఎక్కువ కష్టాలలో ఉందని సమర్థించుకొన జూస్తున్నారు. తెలంగాణ పట్ల ప్రేమతో కాంగ్రెస్‌ను వదిలిన తర్వాత బీఆర్ఎస్‌లో కొనసాగింది ఈ ప్రాంత అభివృద్ధిని కోరుకుని. బీఆర్ఎస్ పాలనలో మంచి అభివృద్ధి జరిగినట్లు ఒప్పుకుంటున్నారు కూడా. అటువంటప్పుడు తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన నిర్ణయం, బీఆర్ఎస్‌తో ప్రయాణం కేవలం తీర్థయాత్ర వంటిది అవుతుందా? ఆ స్థితిలో ఎక్కడ ఉండాలనే నిర్ణయం ఏ పార్టీలో ఎన్నేళ్లు అనే లెక్కలను బట్టి జరుగుతుందా? పోతే కాంగ్రెస్ కష్టాలు ఆ పార్టీ 2014లో ఓడినప్పుడే మొదలై 2019 ఓటమితో తీవ్రమయ్యాయి. ఆ తర్వాత మరొక ఐదేండ్లు గడిచాయి. అయినా తనకు కాంగ్రెస్ మాతృసంస్థ అనుకుంటే ఈ పదేండ్ల కష్టకాలంలో గుర్తుకురాని పార్టీ ఇప్పుడు ఎందుకు వచ్చినట్లు? తీర్థయాత్ర ఇంతకాలం ఎందుకు ముగించలేదు?కేకే సమాధానాల వల్ల మనకు ఈ స్పష్టతలేవీ రాలేదు. అదీగాక తాను పదేండ్లుగా ఉన్న బీఆర్ఎస్ కష్టకాలంలో ఉందని అంగీకరిస్తున్నప్పుడు, ఆ పదేండ్ల క్రితం నుంచే కష్టాలలో ఉండిన కాంగ్రెస్ అనే ఒక బయటి పార్టీపై, ఇప్పటికీ కష్టాలలో ఉన్న పార్టీపై అకస్మాత్తుగా ప్రేమ పుట్టుకు వచ్చిందనటం అసహజంగా, కృత్రిమంగా, తర్కవిరుద్ధంగా తోచడం లేదా?ఈ సందర్భంగా మీడియా వారు కేశవరావు కుమార్తె తన జీహెచ్ఎంసీ మేయర్ పదవిని కాపాడుకోవటం కోసం బీఆర్ఎస్‌ను వదిలి కాంగ్రెస్‌లో చేరుతుండటాన్ని ప్రస్తావిస్తూ.. అందుకు తాను కూడా అదే సమయంలో ఈ నిర్ణయం తీసుకోవడానికి సంబంధం ఉందా? అని ప్రశ్నించారు. అందుకు ఆయన తడబడుతూ, మీడియాను మెప్పించగల సమాధానం కోసం ఆయన ఆలోచించడానికి సమయం లేకకావచ్చు, తన కుమార్తె నిర్ణయం గురించి తనకు అసలు తెలియనే తెలియదని, ఆమె స్వతంత్రురాలైన ఒక వ్యక్తి అని, తన నిర్ణయం తాను తీసుకుందని ప్రకటించారు. కేకే వివరణలలో సూటిదనం, నిజాయితీ, స్పష్టత లేదని దీనితో మరింతగా తేలిపోయింది. తమ నిర్ణయాలకు రెండు రోజుల ముందు కాంగ్రెస్ నాయకులు కేకే ఇంటికి వెళ్లి ఆయనను, తన కుమార్తెను కలిపి పార్టీలోకి ఆహ్వానించిన వివరాలు అప్పుడే మీడియాలో వెలువడ్డాయి. ఊహాగానాలు మొదలయ్యాయి. వాటిని ఇద్దరూ ఖండించలేదు. ఆహ్వానం గురించి తాను, తన కుమార్తె చర్చించుకోలేదన్నట్లు, ఆమె తనను సంప్రదించి తన అంగీకారం తీసుకోకుండానే, తన నిర్ణయం తాను తీసుకుందన్నట్లు, తర్వాత ఒకరికి తెలియకుండా ఒకరు ఒకే సమయానికి పార్టీ మార్పిడి నిర్ణయం తీసుకున్నామన్నట్లు ఆయన ఇప్పుడు చెప్తున్నారు. ఇవన్నీ మనను తప్పుదారి పట్టించజూసే విఫల వివరణలు అవుతాయా, లేక నిజాయితీగల వివరణలా?తన రాజ్యసభ గడువు ఇంకా రెండేళ్లు ఉందని, బీఆర్ఎస్ నుంచి ఎన్నికైనవాడిని గనుక ఒకవేళ రాజీనామా చేయవలసి వస్తే చేస్తానని కేకే చెప్పారు. అయితే అసెంబ్లీలో కాంగ్రెస్‌కు మెజారిటీ ఉంది కనుక తిరిగి ఎన్నికయ్యే అవకాశం ఉన్నందున, ఆ పార్టీ మళ్లీ అవకాశం ఇస్తే తీసుకుంటామన్నారు. ఆయన వంటి మేధావి, తెలంగాణకు కట్టుబడిన వ్యక్తి రాజ్యసభలో కొనసాగితే పార్టీలకు అతీతంగా అందరం సంతోషిస్తాం. అయితే ఆయన విషయాలు స్పష్టంగా చెప్పకపోయినా లెక్కలు మాత్రం స్పష్టంగానే ఉన్నాయి. తన కుమార్తె ప్రస్తుత పదవికి, బహుశా రాజకీయ భవిష్యత్తుకు, ఒకవైపు స్వయంగా ఆయన పార్లమెంటు సభ్యత్వానికి పూర్తి భద్రత ఉండేట్లు లెక్కలన్నీ స్పష్టంగా సరిపోతున్నాయన్నమాట. వాస్తవానికి మన రాజకీయాలలో, అందులోనూ పరిస్థితులు ఇట్లా అనిశ్చయంగా ఉన్నప్పుడు, బీఆర్ఎస్ ఓడిపోయి కనీసం వచ్చే ఐదేండ్ల వరకు గానీ, ఆ తర్వాత గానీ ఏమయ్యేది ఎవరూ చెప్పలేనప్పుడు ఈ విధంగా లెక్కలు వేసుకోవడం చాలామంది చేసే పనే. కేశవరావు కుమార్తెకు ఆయన వంటి విలువలు, సిద్ధాంతాలు ఉన్నాయో లేదో మనకు తెలియదు. తనవలె తెలంగాణ ఉద్యమ భాగస్వామ్యం ఉన్నట్లయితే నేను వినలేదు. అటువంటి స్థితిలో ఆమె ఒకవేళ తన లెక్కలు తాను వేసుకొని ఉంటే పట్టించుకోవాల్సింది ఏమీ లేదు. తండ్రుల లక్షణాలు పిల్లలకు రావాలని ఏమీ లేదు. కానీ కేశవరావు కూడా లెక్కలేమైనా వేసుకున్నారా? అయితే ఏమిటవి అన్నది ఆయన చెప్పిన మాటలను బట్టి మనకు స్పష్టత రావటం లేదు. ఒకవేళ అటువంటిది ఏమైనా జరిగితే (పాపం శమించు గాక) ఆయన తన తీర్థయాత్ర చివరన మూటగట్టుకుంటున్న పాపపుణ్యాలు ఏమిటో తననే ఆలోచించుకోనివ్వాలి. అట్లాగే క్రమక్రమంగా తిరుగులేని విధంగా క్షీణించిపోతున్న కాంగ్రెస్ పార్టీని కేశవరావు తన చేరికతో ఏమాత్రం సముద్ధరించగలిగినా అది సంతోషించవలసిన విషయమే అవుతుంది. దేశానికి నిజంగానే ఒక ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయం అవసరం. కాంగ్రెస్‌కు అటువంటి ఆరోగ్యం లేదన్నది వేరే విషయం.కేశవరావు అసంపూర్తి వివరణల వల్ల తలెత్తుతున్న అయోమయం మరొకటి ఉంది. కేసీఆర్ పాలనలో సాధించిన అభివృద్ధిని ఆయన అనేక మాటలలో పొగిడారు. తెలంగాణను మాత్రమే గాక, ఇతర రాష్ట్రాలను చూసినా అది మరెవరు చేయని పని అన్నారు. ఇందుకు ఎటువంటి షరతులు విధించలేదు. అయినప్పటికీ బీఆర్ఎస్ ఓడటం పట్ల ఆశ్చర్యం ప్రకటిస్తూ, అందుకు కారణాలు ఏమిటో శోధించడం అవసరమన్నారు.ఒక మేధావికి, అనుభవజ్ఞునికి, సోషలిస్టు భావజాలం ఉన్న వ్యక్తికి, తెలంగాణ వలె పీడనకు గురైన ప్రాంతపు అభివృద్ధికి కట్టుబడిన నాయకునికి ఇటువంటి ఆలోచనలు ఉన్నప్పుడు చేయవలసింది ఏమిటి? జరిగిన అభివృద్ధిని ఇంకా ముందుకు తీసుకుపోయేందుకు, ఇంత చేసినా అనూహ్యంగా ఎదురైన ఓటమికి కారణాలను వెతికేందుకు, ఈ అభివృద్ధిని సాధించిన పార్టీకి, నాయకత్వానికి ఈ కష్టకాలంలో చేదోడువాదోడుగా నిలిచేందుకు మరింత పట్టుదలతో పూనుకోవాలి. అటువంటి వారి అవసరం తెలంగాణకు ఎంతైనా ఉంది. ప్రజలు గానీ, చరిత్ర గానీ గుర్తించి, కీర్తించేది అటువంటివారినే. కేశవరావుకు ఈ విషయాలు మనకన్నా అనేక రెట్లు ఎక్కువ తెలుసు.చర్చిస్తూ పోవాలంటే విషయాలు ఇంకా ఉన్నాయి. కానీ అక్కరలేదు. తాను వివరణలు దేని గురించి ఏమిచ్చినా, అందులో స్పష్టత, అంతకన్నా ముఖ్యంగా నిజాయితీ లోపించటం వల్ల కేకే ఈరోజున అనూహ్యమైన విధంగా, ఇంకా చెప్పాలంటే విచారకరమైన విధంగా తెలంగాణ ప్రజల దృష్టిలో అనుమానితునిగా నిలబడ్డారు. కేసీఆర్‌ను, ఆయన పాలనను, సాధించిన అభివృద్ధిని ఎటువంటి సంకోచాలు లేకుండా బాగానే ప్రశంసించారు. అందులో చాకచక్యమైన దౌత్యనీతి ఏదో ఉన్నట్లు ఏమీ అనిపించటం లేదు. కానీ తన నిర్ణయమే అర్థం కాకుండా మిగిలిపోతున్నది. కేశవరావుకు ఇష్టమైన సబ్జెక్టులలో ఫిలాసఫీ ఒకటి. అందులో మిస్టిసిజం తగినంత ఉంటుంది. అది ఇందులోనూ ఏమైనా ఉంటే ఆ చిక్కులను ప్రజల కోసం ఆయనే విడదీయాలి.

# సీసీకెమెరాల ఏర్పాటుతో నేరాల గుర్తింపు



హైదరాబాద్,శాంతి భద్రతల పరిరక్షణలో సీసీకెమెరాల పాత్ర కీలకంగా మారింది. దీంతో పోలీసులు వీటిని ఏర్పాటు చేసేందుకు ఎక్కడిక్కడ ప్రోత్సహిస్తున్నారు. సిసి కెమెరాల ఏర్పాటుకు సంఘాలను పిలిచి మాట్లాడుతున్నారు. ఓ మోస్తరు పట్టణంలో ఇప్పుడు వీటి ఏర్పాటు సాగుతోంది. 33 జిల్లాల కేంద్రాలతో పాటు చోటమోటా పట్టణాల్లో కూడా వీటి ఏర్పాటుకు ప్రోత్సహిస్తున్నారు. స్థానికంగా ఉన్న వ్యాపారులను ఇతరలను పిలిచి మాట్లాడుతున్నారు. ఇటీవల అనేక కేసుల్లో సిసి కెమెరాల ఫుటేజీ బాగా పనికి వస్తోంది. నేరస్తులను గుర్తించి పట్టుకోవడంలో అవి కీలకంగా మారాయి. అందుకే కాలనీలు మొదలు,రోడ్లకు ఇరువైపులా వీటిని ఏర్పాటు చేసేందుకు ప్రోత్సహిస్తున్నారు. దాతల నుంచి సహకారం తీసుకుని సిసి కెమెరాల ఏర్పాటును చేయిస్తున్నారు. సిసి కెమెరాలు ఉన్నచోట జరిగే నేరాల్లో త్వరాగా ఫలితాలు వస్తున్నాయని పోలీస్ అధికారులు కూడా ప్రకటించారు. ఇకపోతే నగరంలో పది లక్షల సీసీ కెమెరాల ఏర్పాటే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు గతంలోనే డిజిపి తెలిపారు. ప్రజా భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు అనివార్యమన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతోనే గొలుసు చోరీలను నివారించ గలిగారు. సీసీ కెమెరాలు అలసిపోయేవి కావని, 24గంటలు పనిచేస్తూనే ఉంటాయని, దీని ద్వారా నేరగాళ్ల ఆచూకిని త్వరగా గుర్తించే వీలుంటుందన్నారు. పోలీస్ సిబ్బంది ఉన్న ఎనిమిదిగంటల మాత్రమే నిఘా ఉండగలరని, అంతకుమించి ఉండే పరిస్థితి ఉండదు. ఒకవేళ నేరగాళ్లను గుర్తించిన కేసుల సమయంలో సాక్ష్యులుగా వీరు ఉండలేరని, అదే సీసీ కెమెరాలైతే నిజనిర్ధారణ వేగంగా అవుతుందన్నారు.

# మాపై సోషల్ మీడియాలో అవాస్తవాలు

హైదరాబాద్,ఇవాళ సోషల్ మీడియా ఫ్రీగా ఉంది కాబట్టి ఇష్టమొచ్చినట్లు పుకార్లు సృష్టిస్తున్నారు.. వాళ్లు పార్టీ మారుతున్నారు.. వీళ్లు పార్టీ మారుతున్నారు అని రూమర్స్ వ్యాప్తి చేస్తున్నారు అని మహేశ్వరం బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ధ్వజమెత్తారు. మా జిల్లాలో నా కోసం ఒక మంత్రి పదవికి రిజర్వ్ చేసి పెట్టారట. నా కుమారుడు కార్తీక్ రెడ్డి చెప్పిన మాదిరిగా చివరి శ్వాస వరకు కేసీఆర్ వెంటే ఉంటామని స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం విస్తృత స్థాయి సమావేశంలో సబిత పాల్గొని ప్రసంగించారు. తోటి ఎమ్మెల్యేలు చేవెళ్ల చె÷-లెలెమ్మ అన్నప్పుడల్లా నా మనసు పులకరించిపోతోంది. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇద్దాం. గత 20 ఏండ్ల నుంచి మిమ్మల్ని చూస్తున్నాను. ప్రతిపక్షంలో ఉండి ఎలా పోరాటం చేయాలో మీకు అందరికీ తెలుసు. ప్రజల కోసం పని చేయాలి. ఈ ఎన్నికల్లో మన పార్లమెంట్ ఏరియాలో ఏమన్న ఇబ్బంది ఉంటే చెప్పండి.. పరుగెత్తుకువస్తాం. కేసులకు భయపడేది లేదు. మొన్న అసెంబ్లీ ఎన్నికల్లో చిన్న తట్టు తాకింది.. దాంతో వెనక్కి వెళ్లాల్సిన అసవరం లేదు. గట్టిగా పని చేసి కాసానిని గెలిపించి, కేసీఆర్ రుణం తీర్చుకుందాం. విశ్వేశ్వర్ రెడ్డి, రంజిత్ రెడ్డి ఎవరో మనకు తెలియకపోయినా కేసీఆర్ పంపించారు.. మనం గెలిపించాం. అంతో ఇంతో కాసాని మనతో మమేకమై పని చేస్తూ వస్తున్నారు. ఈ రోజు బడుగుల గొంతుక పార్లమెంట్‌లో వినిపించాలంటే ఆయనను గెలిపించాలి. కార్యకర్తల శక్తి ఏంటో ఇప్పుడు చూపించాలి. కేసీఆర్ అంటే ఏంటి..? కేసీఆర్ సైన్యం ఏంటో చూపించాలి. మాకు వచ్చిన మెజార్టీ కంటే కాసానికి డబుల్ మెజార్టీ రావాలి. ఇవాళ పార్టీ మారుతున్న వారంతా మానవత్వం లేని వారు అని సబిత ఆగ్రహం వ్యక్తం చేశారు.

# జనం నోట ఇదే మాట..

అమరావతి,రాష్ట్రంలో ఈసారి ఎన్నికలు హోరాహోరీగా జరగ బోతున్నాయి. ఇప్పటికే ఆ వాతావరణం కన్పిస్తోంది. విమర్శలు, ప్రతివిమర్శలు, ఆరోపణలు, నిందలు, నిష్టూరాలు.. పరిమితి దాటి పతాకస్థాయికి చేరుతున్నాయి. నిన్న మొన్నటిదాకా విమర్శల్లో వాడిన భాష, ఆరోపణల్లో పసపైనే అందరూ మాట్లాడేవారు. కానీ ఇప్పుడు నేతలతోపాటు ఓటర్లూ రాజకీయాలపై రచ్చబండల్లో చర్చలు మొదలుపెట్టేశారు. ఈసారి ఎన్నికలపై వారు ఒక అభిప్రాయానికి వచ్చేశారు. వారి దృష్టిలో ఈసారి ఎన్నికలు ఇద్దరి మధ్యే.. రెండు అంశాల మధ్యే. ఒకరు అధికార పార్టీ అధ్య క్షుడు, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి.. అతడితో తలపడుతున్నది టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు రెండో వ్యక్తి. ఇక కూటమి పక్షాలు, నేతలు ప్రధాన విపక్ష పార్టీ అస్త్రశస్త్రాలుమాత్రమే. అలాగే, ఈ ఎన్నికల్లో ప్రధాన అంశాలు.. రెండే. ఒకటి అధికార వైసీపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వాటిని ప్రజలకు చేరవేస్తున్న వాలంటీర్ల వ్యవస్థ, ప్రజల చెంతకు చేరిన సచివాలయ వ్యవస్థ, సెంటిమెంట్%ా% దీనిని ప్రజలు, ఓటర్లు విశ్వసిస్తే వైసీపీదే హవా. వైసీపీ అధినేత వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి రెండోసారి అధికారంలోకి రావడం ఖాయం. అలాకాక, విధ్వంస పాలకుడు అంటూ జగన్‌పై చేస్తున్న ప్రచారం, అతడి నుంచి రాష్ట్రానికి విముక్తి కావాలంటూ టీడీపీ కూటమి చేస్తున్న ఆరోపణలు, వారి అభివృద్ధి నినాదం, టీడీపీ అధినేత రాజకీయ, పాలనానుభవం అక్కరకొస్తాయని ప్రజలు అనుకుంటే.. సైకిల్‌దే సవారీ. ఈ రెండు అంశాల్లో%ా% ఈ ఇద్దరు నాయకుల్లో ప్రజలు ఎవరివైపు మొగ్గితే వారిదే అధికారం. ఈ ఎన్నికల్లో ఆ రెండు అంశాలు, ఆ ఇద్దరు నేతలు మినహా మిగతావేవీ కీలకం కాదు. ఎన్నికలవేళ ఇక నేతలు, పార్టీల టక్కుటమార విద్యలు, గజకర్ణగోకర్ణ మాయలు, తాయిలాలు.. డబ్బు, అభ్యర్థుల ప్రభావం, వ్యూహాలు, సర్వేలు అనేవి తుదితీర్పునకు కారణాలు కానేకావు. ఇదీ సగటు ఆంధ్రుడి అంతరంగం.

రాజకీయాలపై సామాన్యుడి మనసులోని మాట..

రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గరపడే కొద్దీ రాజకీయ సమీకరణలు రోజుకో మలుపు తిరుగుతూ ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను హీటెక్కిస్తున్నాయి. వరుసగా రెండవసారి అధికారాన్ని సొంతం చేసుకోవాలని వైసీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తనదైన శైలిలో 'మేమంతా సిద్ధం' అంటూ పావులు కదుపుతున్నారు. గత ఎన్నికల్లో చేజారిన అధికారాన్ని తిరిగి సొంతం చేసుకోవాలని టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 'ప్రజాగళం'తో ఎన్నికల యుద్ధంలోకి దిగారు. 2019 ఎన్నికల్లో టీడీపీ ఘోర పరాభావాన్ని చవిచూసింది. రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి జరిగిన ఎన్నికల్లో టీడీపీ అధికారాన్ని సొంతం చేసుకున్నప్పటికీ ఆ తర్వాత జరిగిన 2019 ఎన్నికల్లో ఓటమి పాలైంది. వైసీపీ రికార్డు స్థాయిలో విజయం సాధించింది.అయితే, గడిచిన ఐదేళ్లుగా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అధికార పార్టీపై తనదైన శైలిలో పోరాటం చేస్తూ రాష్ట్రంలో తెలుగుదేశానికి మరింత బలాన్ని అందించేలా పనిచేస్తూ వస్తున్నారు. ఆ దిశగా పార్టీ శ్రేణులను నిరంతరం ఉత్తేజపరుస్తూ వైసీపీ ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై యుద్ధం చేస్తూ వస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో సూపర్ సిక్స్ అంశాలనే గెలుపు మంత్రంగా మలచుకుని ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా చంద్రబాబు దూకుడుగా ముందుకు సాగుతున్నారు. ఈ నేపథ్యంలోనే జగన్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని ఆయన నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పించి ఆగిన అభివృద్ధిని తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక పూర్తి చేసి చూపిస్తానంటూ ఆయన అభివృద్ధి మంత్రంతో ప్రజల్లోకి వెళ్లారు. అయితే ప్రస్తుత ఎన్నికల సమరంలో చంద్రబాబు మంత్రం హిట్ అయితే మాత్రం టీడీపీకి తిరుగుండదు. రాష్ట్రంలో మరోసారి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారాన్ని సొంతం చేసుకోవడం ఖాయమన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. పల్లెల్లో ఎవరి నోట విన్నా ఇదే అంశంపై చర్చ నడుస్తోంది. మరీ.. చంద్రబాబు మంత్రం ఫలిస్తుందో.. లేదో ఎన్నికల వరకు వేచి చూడక తప్పదు. రాష్ట్రంలో గ్రామస్థాయి నుంచి బలమైన శక్తిగా పాతుకుపోయిన వైసీపీని ప్రస్తుత ఎన్నికల్లో ఇంటికి పంపాలన్న పట్టుదలతో చంద్రబాబు నాయుడు జనసేన, బీజేపీలతో కలిసి కూటమిగా ఏర్పడ్డారు. అయితే సీఎం జగన్ మాత్రం ప్రజలకిచ్చిన ప్రతి హామీని నెరవేర్చారు.. ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ ఫలాలన్నింటినీ అందిస్తూ వచ్చారు. ప్రత్యేకించి వాలంటీర్ వ్యవస్థపైనే ఆయన ఆశలన్నీ పెట్టుకున్నారు. ఖచ్చితంగా సార్వత్రిక ఎన్నికల్లో తాను నమ్ముకున్న సంక్షేమమే శ్రీరామరక్షగా నిలుస్తుందన్న ధీమాతో ఉన్నారు. ఎన్నికల ప్రచారంలోనూ ఆయన బలంగా పదేపదే ఇదే అంశాన్ని ప్రజలకు వివరిస్తున్నారు. తానెప్పుడు తప్పు చేయ లేదని, ప్రజల కోసం ఇచ్చిన ప్రతి మాటను నిలుపుకున్నానని చెబుతూ వస్తున్నారు. ఆ దిశగానే వాలంటీర్ వ్యవస్థ, సంక్షేమంపై ప్రజల్లో జోరుగా చర్చ సాగుతోంది. ఎన్నికల్లో ఈ రెండు అంశాలు పనిచేస్తే మాత్రం మరోసారి జగన్ హవానే సాగనుంది. రాజకీయ విశ్లేషకుల్లో కూడా ఇదే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వైసీపీ వర్గాల్లో కూడా వాలంటీర్ వ్యవస్థ పైనే బలమైన నమ్మకాన్ని, విశ్వాసాన్ని కల్పిస్తున్నాయి.

# సహకార రంగం బలోపేతం కావాలి

హైదరాబాద్,సహకార వ్యవస్థలో దగుల్బాజీలు చేరడం వల్ల అది నిర్వీర్యం అవుతోంది. రైతులను ఆదుకుని వారికి అండగా నిలవాల్సిన సహకారరంగం పూర్తిగా కట్టుతప్పింది. సహకార బ్యాంకులు తమ విధానాలను పూర్తిగా తుంగలో తొక్కాయి. నిజానికి గ్రామస్థాయిలో సహకార రంగం బలంగా ఉంటే.. రైతులు బలపడతారు. సహకారరంగంతో పాటు మార్కెట్ వ్యవస్థ కూడా బలంగా ఉండాలి. తెలంగాణలో రైతు సమన్వయ సమితులు ఏర్పాటు చేసినా అవి కేవలం ఓ రాజకీయ కమిటీలుగా పనిచేసాయి. పదవుల కోసం సృష్టించిన కమిటీలుగా దిష్టిబొమ్మలులగా నిలిచాయి. దీనిని ప్రకటించినప్పుడు ఆనాటి సిఎం సిఎం కెసిఆర్ ఎన్నో ఆదర్శాలు ప్రకటించారు. రైతు సమన్వయ సమితులు ఎక్కడా ఒక్క రైతు సమస్యను పరిష్కరించిన దాఖలాలు లేవు. మార్కెట్లో రైతులు పడిగాపలు కాసినా, ధరలు రాక అవస్థలు పడ్డా,,ధాన్యం తడిసి నెత్తీనోరు మొత్తుకున్నా దానికి నాటి ఛైర్మన్‌గా, నేడు ఎమ్మెల్యేగా ఉన్న పల్లా రాజేశ్వరరెడ్డి ఎక్కడా కానరాలేదు. నిజానికి రైతులకు అండగా ఉండాల్సిన సమన్వయ సమితులు ఉత్సవ విగ్రహాల్లా మారాయి కనుకనే రైతులపై కేంద్రంతో పోరాడుతున్నారు. తెలంగాణకు సంబంధించి రైతువిధానాలు రూపొందించడంలో ఈ సమితి పూర్తిగా విఫలం అయ్యింది. రైతులు తమ బాధలు పడలేక అందరి లాగే తానూ ఏదో పట్నం వెళ్లి పనిచేసుకుంటూ పొట్ట పోసుకుంటానని నిర్ణయించుకుంటే..ప్రజల గతేం కానుందో ఊహించుకోవాలి. వ్యవసాయం పడావు పడితే ప్రజలకు అన్నపానీయాలు దొరకవు...ఆధునిక యువతకు వ్యవసాయంపై బొత్తిగా అవగాహన లేకపోవడం కూడా మనకు ప్రమాదమే... అందుకే వ్యవసాయాన్ని ప్రాథమిక స్థాయి నుంచి విద్యలో పాఠ్యాంశంగా చేర్చాలి. అప్పుడే ప్రజలకు అవగాహన పెరుగుతుంది. రైతులకు కావాల్సింది సకాలంలో నీరు రావడం.. నిరంతరాయంగా విద్యుత్ అందుబాటులో ఉండడం.. పెట్టుబడి కోసం బ్యాంకులు విరివిగా రుణాలు ఇవ్వడం..ఇవన్నీ సక్రమంగా జరిగిన తరవాత పంటలను ఎలాంటి పేచీలు లేకుండా కొనుగోలు చేయడం.. ఇలా చేస్తే మన పొలాల్లో వారు బంగారాన్నే పండిస్తారు. అందుకు అవసరమైన వాతావరణం సృష్టించాలి. రైతులకు అలక రాకుండా.. వారు నైరాశ్యం చెందకుండా వెన్నుతట్టి ప్రోత్సహించాలి. రతైఉబంధు పేరుతో దుబారాగ చేయడం కూడా సరికాదు. వ్యవసాయాన్ని పండగ చేయాలన్న ఆలోచనతో కార్యాచరణకు దిగాలి. వ్యవసాయం దండుగ అన్న నానుడి నుంచి వ్యవసాయం పండుగ అనేలా చేయాలి. రైతులు నిశ్చింతంగా వ్యవసాయం చేయొచ్చు అన్న భావన కలిగించాలి. గత పదేళ్లలో తీసుకున్న చర్యలు మేలుచేసేవిగా లేవనే చెప్పాలి. పంటల కొనుగోళ్ల సమయంలో రైతులకు ఆందోళన లేకుండా పంటలను అమ్ముకోవడం లేదు. నిశ్చింతంగా మార్కెట్‌కు వచ్చి పంటలను చక్కగా అమ్ముకోగలిగేలా మార్కెట్ విధానాలు అవలంబించాలి. అప్పుడే సంపూర్ణ ప్రోత్సాహం దక్క గలదు. అయితే మార్కెటింగ్ వ్యవస్థ ఒక్కటే సక్రమంగా లేకపోవడంతో ఏటా రైతులు పండించిన పంటలను మద్దతు ధరలకు అమ్ము కోలేక పోతున్నారు. ఆర్థికంగా అండగా నిలవాలన్న విధంగా కార్యక్రమాలు చేయాలి. అప్పుడే దేశం కూడా ఆర్థికంగా పుంజుకుంటుంది. ప్రజలకు తక్కువ ధరలో ఆహారధాన్యాలు అందుతాయి. ఎగుమతుల ద్వారా విదేశీమారకం సంపాదించుకోగలుగుతాం. ఆలా చేయనంత కాలం భారత అన్నదాతల తలరాత మారదు. కేవలం రైతుబంధు, ఉచిత విద్యుత్ సరఫరాతో సత్ఫలితాలు రావని గుర్తించడం లేదు. రైతుబంధులోనూ వ్యవసాయం చేయని వారి ఖాతాల్లో నగదు పడిపోతోంది. దీనిని సమీక్షించాల్సిన అవసరం ఉంది. పోరంబోకు భూములున్న వారికి రైతుబంధు పేరుతో లక్షల్లో జమ చేసారు. దీనిపై సమీక్షించాలి. ఇలా డబ్బు వృధాను అరికట్టాలి. వ్యవసాయం చేస్తున్నారా లేదా.. ఆ భూముల్లో ఏ పంటలు పండుతున్నాయో గుర్తించాలి. ఇలాంటి భూములకు ఉచిత విద్యుత్ ఇస్తూ గృహవినియోగదారులపై ఛార్జీల భారం మోపడం సరికాదు. నీటిసౌకర్యం పెరగడంతో తెలంగాణలో ధాన్యం దిగుబడులు కూడా పెరిగాయి. అయితే ఈ మేరకు కొనుగోళ్లు మాత్రం సాగడం లేదు. చివరి గింజవరకు ధాన్యం కొంటామన్న ప్రకటనకు కట్టుబడి విస్తృత ఏర్పాట్లు చేయాలి. తెలంగాణలో చేపట్టిన రైతుబంధు పథకం ఎంతగా దుర్వినియోగం అయ్యిందో చూశాం. దీనిని గొప్పగా చెప్పుకోవడం సిగ్గుచేటు. వారికి అందించిన పెట్టుబడి ప్రోత్సాహకం అన్నది వారిలో భరోసా కల్పించేదిగా మాత్రమే ఉండాలి. రైతును రాజు చేసేందుకు, వ్యవసాయాన్ని పండగ చేసేందుకు తీసుకొచ్చిన రైతుబంధు పథకం కేవలం ఓట్ల పథకంలా మారింది. చెరువుల పునురుద్ధరణ కార్యక్రమాలు డొల్ల అని తేలాయి.

# సీఎం రమేష్ వర్సెస్ వైవీ సుబ్బారెడ్డి!

అనకాపల్లి, ఏపీలో ప్రస్తుతం ఆ ఇద్దరు నేతల గురించి జోరుగా చర్చలు నడుస్తున్నాయి. రెండు పార్టీలకు ప్రతినిధులుగా వచ్చిన ఆ ఇద్దరూ వ్యక్తిగత ప్రతిష్ట కోసం దాదాపు యుద్ధమే చేస్తున్నారు. ఈ ఎన్నికలు ఇద్దరికీ ఇజ్జత్ కా సవాలే. సీఎం రమేష్ వర్సెస్ వైవీ సుబ్బారెడ్డి.. స్ట్రాటజీలు-కౌంటర్ స్ట్రాటజీలతో ఉత్తరాంధ్ర రాజకీయాల్ని కాక రేపుతున్నారు. వాళ్లిద్దరి మధ్య ఎందుకింత భగ్గుభగ్గు..? ప్రస్తుతానికి ఎవరిది పైచేయి? ప్రాంతీయ ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో పార్టీని నడిపించాలన్నది వైసీపీ సంస్థాగత స్ట్రాటజీ. ఒక్కొక్కరికి రెండు లేదా మూడు జిల్లాలు.. 30 నుంచి 40 వరకు అసెంబ్లీ సెగ్మెంట్లనిచ్చి.. వాటిల్లో పార్టీ బాగోగుల్ని చూసుకోవడం వీళ్ల బాధ్యత. ఆ కోవలో ఉత్తరాంధ్ర ప్రాంతీయ ఇన్‌చార్జిగా వచ్చిన విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి, సజ్జల రామక్రిష్ణారెడ్డి.. ఇప్పుడు అదే సీక్వెన్స్‌లో సీన్లోకొచ్చారు వైవీ సుబ్బారెడ్డి. 2014లోనే ఉత్తరాంధ్ర ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించారు వైవీ సుబ్బారెడ్డి. కానీ.. అప్పుడు పార్టీ ఓటమిపాలవడంతో ఆయన్ను తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల ఇన్‌చార్జిగా పంపారు. ఆసమయంలో ఉత్తరాంధ్ర చార్జ్ తీసుకున్నారు విజయసాయిరెడ్డి. 2019 ఎన్నికలప్పుడు వ్యూహం మార్చి సాయిరెడ్డిని దక్షిణ కోస్తాకు పంపి.. ఆ ప్లేస్‌లో మళ్లీ వైవీ సుబ్బారెడ్డినే ఉత్తరాంధ్రకు పంపింది వైసీపీ హైకమాండ్. పార్టీ అధిష్టానం ప్రతినిధిగా స్థానికంగా శ్రేణుల్ని సమన్వయ పరుస్తూ దాదాపు ఏడాది నుంచి ఉత్తరాంధ్రలో చురుగ్గా తిరుగుతున్నారు వైవీ సుబ్బారెడ్డి. ఈసారి ఎన్నికల్లో పోటీలో లేకపోయినా.. ఉత్తరాంధ్రలో పార్టీ గెలుపు బాధ్యతల్ని భుజాన వేసుకున్నారు వైవీ సుబ్బారెడ్డి.ఇదే గ్యాప్‌లో ఉత్తరాంధ్ర వైపు చూసిన మరో సీమ నేత సీఎం రమేశ్. బీజేపీ రాజ్యసభ ఎంపీగా ఉన్నప్పటికీ%ా% ఆయన మనసంతా విశాఖ మీదే ఉండేది. ఎంపీగా పోటీ చేయాలనేది ఆయనకున్న బలమైన ఆకాంక్ష. అప్పుడప్పుడూ స్పెషల్ ఫ్లయిటేసుకుని వైజాగ్ వచ్చి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేవారు. కానీ.. జీవీఎల్ నుంచి బలమైన పోటీ ఎదురవడం, టీడీపీ నేత భరత్ పట్టుబట్టడంతో.. సీఎం రమేశ్‌కి విశాఖ ఎంపీ సీటు మిస్సయింది. కానీ.. కూటమి అభ్యర్థిగా అనకాపల్లి ఎంపీగా రేసులో ఉన్నారు సీఎం రమేష్. విశాఖ మెట్రో సిటీ కనుక అక్కడ సామాజిక వర్గాలతో సంబంధం లేదు. అనకాపల్లి ఎంపీ సీటు ఎక్కువగా రూరల్ కవరేజ్ కనుక అక్కడ కులసమీకరణాలే కీలకం. అనకాపల్లిలో తూర్పుకాపుల తర్వాత అతి పెద్ద సామాజికవర్గం వెలమ. తను కూడా వెలమే కనుక.. 3 లక్షల వెలమ ఓట్లున్న అనకాపల్లినే ఎంచుకున్నారు సీఎం రమేష్. పైగా.. స్థానిక నేతలు బండారు సత్యనారాయణ, అయ్యన్నపాత్రుడు, గవిరెడ్డి రామానాయుడు లాంటి వెలమ కులస్థులతో సీఎం రమేశ్‌కి సన్నిహిత సంబంధాలున్నాయి. అందుకే.. అనకాపల్లిలో సీఎం రమేశ్ గెలుపు ఖాయమేనన్న క్లారిటీతో ఉంది విపక్ష కూటమి.

# ఏపీ బీజేపీలో నైరాశ్యం.. పార్టీకి పాడిగట్టే పనిలో యమబిజీ




అమరావతి,దగాపడ్డ ఏపీని కొత్త దారుల్లో నడిపిద్దామని ఒకవైపు పవన్ కళ్యాణ్, ఇంకోవైపు చంద్రబాబు తాపత్రయపడుతుంటే.. మరోవైపు కూటమిలో కుంపట్లు పెట్టే యోచనలో బీజేపీ నేతలున్నారు. వైసీపీ అధినేత జగన్‌ని ఢీకొట్టాలంటే పార్టీలన్నీ ఏకం కావాలని, అప్పుడే అధికారం చేజిక్కించుకొవచ్చన్న రాజకీయ తంత్రాన్ని కొంతమంది బీజేపీ నేతలు నీరుగార్చే పనిలోపడ్డారు. తమకు సీటు దక్కలేదన్న ఆక్రోశంతో సొంత పార్టీనే బొందపెట్టే పనిలో యమ బిజీగా ఉన్నట్టు తెలుస్తోంది. అందుకని అసంతృప్తులు, అలకలతో పార్టీ కార్యక్రమాలకు దూరం అవుతున్నారు. అంతేకాకుండా ఇతర పార్టీల్లో సీట్ల వెంపర్లాటకు సై అంటున్నారు. ఈ క్రమంలో కొందరు సైకిల్‌పై సవారీకి రెడీ అవుతుంటే.. ఇంకొందరేమో ఫ్యాను గాలికి సేదతీరాలని చూస్తున్నారు. ఇలాంటి లీడర్ల తీరు చూసి జనం చీత్కరించుకునే పరిస్థితి వచ్చింది.కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి రావటం గ్యారెంటీ అని ప్రచారం ఊపందుకుంది. ఏపీలో కనీసం ఉనికిలో లేని బీజేపీ నేతలు మాత్రం కాషాయం కండువాలను గాలిలో గిరగిరా తిప్పుతూ మేఘాలలో తేలిపోతున్నారు. ఇక.. అప్పుడే తాము రాష్ట్ర, జాతీయ స్థాయిలో పార్టీ పదవులు కొట్టేసనట్టు ఫీలవుతున్నారు. ఇప్పటికే ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు తరహాలో తాము కూడా రాజకీయాలను శాసిస్తామని తెగ సంబరపడిపోతున్నారు. కానీ, పార్టీ ఎదుగుదలను మాత్రం వీరు పట్టించుకోవడం లేదు. ఏపీలో బీజేపీకి 2014లో 13 సీట్లు ఇస్తే%ా% పోటీ చేయటానికి 11 మందే దొరికారు. వీరిలో నలుగురే గెలిచారు. నాలుగు స్థానాల్లో ఇద్దరు గెలిచారు. కానీ, ఇలా గెలిచిన ఆరుగురూ.. బీజేపీ వల్లే గెలిచారనుకుంటే.. వీరికి అసలు విషయం తెలీనట్టే. కంభపాటి హరిబాబు, గోకరాజు గంగరాజు బీజేపీ గుర్తుపై గెలిచారు.. కానీ, కమలం గుర్తును చూసి కాదని, ఇక్కడ వ్యక్తుల పరపతి, వారి వ్యక్తిగత అంశాలను చూసి ఓటేసినట్టు స్పష్టమవుతోంది.

ఏపీలో ఉనికే అంతంత!

ఈ ఎన్నికల్లో పొత్తు కుదరటమే ఓ గొప్ప. అదీ టీడీపీ, జనసేన తలవంచి సీట్లు ఇవ్వటం మరో గొప్ప. ఏకంగా ఆరు ఎంపీ సీట్లు.. 10 అసెంబ్లీ సీట్లు కేటాయించటం మరో విశేషం. ఎందుకంటే.. గత ఎన్నికల్లో టీడీపీ ఓటు బ్యాంకు 39. 17 శాతం, జనసేన బలం 5,53 శాతం. ఇక సీట్ల కోసం అలుగుతున్న బీజేపీ సొంత ఓటు బ్యాంకు ఎంతంటే.. కేవలం 0.84 శాతమే. ఇదే ఎన్నికల్లో నోటాకు పడిన ఓట్ల శాతం 1.28 శాతం. అసలు ఏపీలో ఉనికే లేదు. మరి ఈ రాద్ధాంతమేంటీ? పోనీ గెలిచే అభ్యర్థులున్నారా? ఆ ఒక్కటీ అడక్కూడదు. పోటీ చేయడానికి అభ్యర్థులను కావలెను అని బోర్డు పెట్టుకునే పరిస్థితి. పార్టీలో ఉండే నలుగురైదుగురు. వీరిలో ఎవరు గెలుపు గుర్రమో.. వాళ్లకే తెలీదు. పైగా అలకలు, అసంతృప్తులు.. అసమ్మతులు.. ఇది ఏపీ బీజేపీ పరిస్థితి.. దాదాపు ఏపీలో కనుమరుగవుతుందనుకున్న సమయంలో.. రాష్ట్రంలో మరోసారి నిలబడేందుకు వచ్చిన అవకాశాన్ని సీనియర్లే కాళ్లదన్నుతున్నారనే అపవాదు వస్తోంది.

ఆ పీడకలను మర్చిపోతే ఎలా?

2019 ఎన్నికల ఫలితాలు ఏపీ బీజేపీకి ఓ పీడకలగా చెప్పుకోవచ్చు.. ఈ పార్టీకి వచ్చిన ఓటింగ్ శాతం., నోటా కంటే తక్కువ. నిజానికైతే ఏ పార్టీ అయినా ఇలాంటి పరిస్థితి వస్తే ఏం చేస్తుంది. మళ్లీ ఎన్నికల వరకు బలపడేందుకు యత్నిస్తుంది. కేంద్రంలో అధికార బల ఉంది. కానీ, ఏపీలో బీజేపీ బలపడింది ఎంత? పార్టీ సమావేశం పెడితే.. ఉన్న పదిమంది సీనియర్ నేతల్లో సగం మంది రారు.. ఉదాహరణకు బెజవాడలో బీజేపీ పదాధికారుల సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సమావేశానికి కీలక నేత సోము వీర్రాజు రాలేదు.. రాజ్యసభ ఎంపీ జీవీఎల్ నర్సింహరావు డుమ్మా కొట్టారు. మరో నేత విష్ణువర్ధన్ రెడ్డి ఆచూకీ లేదు. వీరంతా ఎందుకు రాలేదు?.. ఎందుకంటే కోరుకున్న సీటు దక్కలేదన్న కోపం, ఆక్రోశంతో పార్టీని ధిక్కరించే స్థాయికి చేరారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

సీటు రాకపోతే పార్టీకి పాడి కట్టేస్తారా?

కేంద్రంలో అధికారం ఖాయం. అందుకు దక్షిణాదిలో సీట్లు పెరగాలి. ఇదీ బీజేపీ అధిష్ఠానం వ్యూహం, కేంద్రంలో అధికారంలోకి ఎలాగు వస్తాం. ఇక ఏపీలో తమను మించిన నాయకుడు తెరమీదకు వస్తే.. ఇప్పటి యోగం దక్కదనే భయంతోనే ఏపీలో బీజేపీకి సీనియర్లు పాడి కట్టేస్తున్నారని పొలిటికల్ ఎనలిస్టులు విమర్శిస్తున్నారు. బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి కదిరి సీటుపై ఆశపెట్టున్నారు. కానీ, టీడీపీ తరపున యశోధా దేవిని అభ్యర్థిగా టీడీపీ ప్రకటించింది. విశాఖ ఎంపీ టికెట్‌ను జీవీఎల్ నర్సింహారావు కావాలన్నారు. అది కూడా టీడీపీనే దక్కించుకుంది. భరత్‌ను అభ్యర్థిగా ప్రకటించారు. ఇక సోమువీర్రాజు రాజమండ్రి ఎంపీ సీటును కోరుకున్నారు. కానీ వాళ్ల పార్టీ అధిష్టానం ఆ టికెట్‌ను.. పురందేశ్వరికి కట్టబెట్టింది. దీంతో చాలామంది అలకపానుపు ఎక్కారు.. మీటింగ్‌కు డుమ్మా కొట్టారు. ఈ చర్యలతో పార్టీకి ఉన్న కొద్దిపాటి కార్యకర్తలకు. పార్టీ కంటే స్వప్రయోజనాలే ముఖ్యమని సరికొత్త సంకేతం తప్పలేదు.

ఆ గట్టులో కొందరు.. ఈ గట్టున మరికొందరు

ఇదే కాదు ఏపీ బీజేపీని మరో పంచాయితీ తెగ కంగారు పెడుతోంది. కొందరు టీడీపీ గట్టు మీద, మరి కొందరు వైసీపీ గట్టు మీద పొర్లుతున్నారనే ప్రచారం బీజేపీని ఇరుకున పెడుతోంది. ఏ పార్టీ గెలిచినా కేంద్రంలో తమ పార్టీకి మద్దతు లభిస్తుందనే బీజేపీ అగ్ర నాయకత్వం ఈ గ్రూపుల్ని పోషిస్తున్నాయనే అనుమానాలు తెరమీదకు వస్తున్నాయి, ఇప్పుడు చెరో గట్టున చేదదీరిన ఈ రెండు వర్గాలు ఒకరిపై మరొక వర్గం చాడీల యాగం షురూ చేశాయి. సరీగా ఇలాంటి స్థితిలోనే ఇప్పటికే పది సీట్లు ధారాదత్తం చేశామని టీడీపీ కార్యకర్తలు అగ్గిమీద గుగ్గిలం అవుతుంటే.. ఇక జనసైనికుల్లోనూ కోపం రగిలింది. మోదీ, అమిత్ షా దర్బారులో తమకు తగిన స్థానం లభిస్తుందనే ఆలోచనతో పొత్తులో తమకు 24 సీట్లు కేటాయిస్తే.. బీజేపీ కోరిక మేరకు మరో మూడు సీట్లు జనసేన త్యాగం చేసింది. మళ్లీ ఒక నాయకుడి కోసం జన సేన సీటును త్యాగం చేయాలని బీజేపీ పెద్దలు వెంటపడటంతో%ా% జనసైన్యంలో ఆగ్రహం తారాస్థాయికి చేరుతోంది. ఇంతకీ ఏపీలో సీనియర్లు బీజేపీని బతికిస్తారా? లేక బొందలో పెడతారా? అనే ప్రశ్నలు ఉమ్మడి అభ్యర్థుల్ని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.

పొత్తును లైట్ తీసుకుంటున్న కమలనాథులు

ఇదే కాదు ఏపీ బీజేపీని మరో పంచాయితీ తెగ కంగారు పెడుతోంది. పేరుకు బీజేపీలోనే ఉన్నా.. ఓ బ్యాచ్ టీడీపీకి.. మరో బ్యాచ్ వైసీపీకి ఫేవర్‌గా ఉన్నారన్న ప్రచారం ఉంది. ఇలా ఓ బ్యాచ్ మరో బ్యాచ్ నేతలపై విమర్శలు చేస్తున్నారు. వారి వల్ల..వీరికి.. వీరి వల్ల వారికి టికెట్లు దక్కడం లేదంటూ తెగ ఫీలైపోతున్నారు. సరే నిజంగానే వీళ్లకు టికెట్లు దక్కాయనుకోండి. జస్ట్ అనుకోండి. వీళ్లకు పడే ఓట్లు ఎన్ని? వీళ్ల చరిష్మా ఎంత? పార్టీకి ప్రజల్లో ఉన్న పలుకుబడేంటి? ఇది కదా ఆలోచించాల్సింది. కానీ ఈ ఆలోచన ఏ ఒక్కరిలోనూ కనిపించడం లేదు. 2014 ఎన్నికల్లో పొత్తులతో పోటీకి వెళితే.. 7.22 శాతం ఓట్లు వచ్చాయి.. 2019 ఎన్నికల్లో ఒంటిరిగా పోటీ చేస్తే.. ఒకశాతం ఓట్లు కూడా రాలేదు.. ఎగ్జాక్ట్‌గా చెప్పాలంటే 0.98 శాతం ఓట్లు వచ్చాయి. ఆ ఎన్నికల్లో నోటాకు వచ్చిన ఓట్లు 1.24 శాతం. ఇది బీజేపీ ఘనత.. ఈసారి పొత్తులో ఉన్నారు కాబట్టి కాస్త ఓట్లు పెరగడం.. దాంతో పాటు సీట్లు వచ్చే అవకాశం ఉంది. బీజేపీకి పొత్తు అనేది ఓ గోల్డెన్ చాయిస్.. కానీ ఆ చాయిస్‌ను చాలా లైట్‌గా తీసుకుంటున్నారు ఏపీ కమలనాథులు.

లోకల్ లీడర్ల ఓవరాక్షన్..

నిజానికి టీడీపీతో బీజేపీ పొత్తు పెట్టుకోవడమే గొప్ప విషయం.. ఎందుకంటే.. చంద్రబాబు ప్రధాని మోదీపై ఎన్ని విమర్శలు చేశారు గతంలో.. అంతేందుకు పొత్తుకు కుదిర్చేందుకు రాయబారం నడిపిందే తానని.. చెబుతున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ మోడీపై ఎన్ని విమర్శలు చేయలేదు. ఇవన్నీ మోడీ, అమిత్ షాలకు తెలియదా? మర్చిపోయారా? నో.. అలాంటిది జరిగే చాన్సే లేదు. కానీ, అయినా పదిమెట్లు దిగొచ్చి ఆ పార్టీలతో పొత్తు పెట్టుకున్నారు. ఎలాంటి ఈగో చూపించలేదు. ఎలాంటి హెచ్చులకు పోలేదు. తక్కువ సీట్లైనా రాష్ట్రంలో పార్టీని బతికించాలనుకున్నారు. కానీ, లోకల్ లీడర్స్ ఓవరాక్షన్ మాత్రం తగ్గడం లేదు. అర్థంలేని పంతాలకు పోయి అలకపాన్పు ఎక్కితే.. చివరికి అడ్రస్ లేకుండా పోయేది వారు మాత్రమే కాదు. వారిని బతికిస్తున్న బీజేపీ అని తెలుసుకోవడం లేదు. ఇదే కంటిన్యూ అయితే.. ఏపీలో బీజేపీ అడ్రస్ గల్లంతవ్వడం ఖాయమనే ప్రచారం ఇప్పటికే జరుగుతోంది.

# కడప టిడిపి అభ్యర్థిగా భూపేశ్ రెడ్డి

కడప,కడప లోక్‌సభ టీడీపీ అభ్యర్థిగా చడిపిరాళ్ల భూపేష్ రెడ్డి పేరును ఆ పార్టీ శుక్రవారం ప్రకటించింది. అంటే.. కూటమి అభ్యర్థిగా భూపేష్ రెడ్డి పేరు ఖరారైంది. అయితే ఇప్పటి వరకు కడప ఎంపీ అభ్యర్థిగా వైయస్ వివేకా కుమార్తె సునీత నర్రెడ్డి లేదా ఆమె తల్లి వైయస్ సౌభాగ్యమ్మ పేరు పరిశీలనలో ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో ఓ ప్రచారం గట్టిగానే జరిగింది. ఒక వేళ వీళ్లిద్దరిలో ఒకరు ఎన్నికల బరిలో దిగితే.. వారికి మద్దతుగా కూటమి అభ్యర్థి నిలబెట్టే అవకాశం లేదనే ఓ ప్రచారం కూడా సైతం బాగానే నడిచింది. కానీ తాజాగా కూటమి అభ్యర్థిగా భూపేష్ రెడ్డి ప్రకటనతో.. వివేకా ఫ్యామిలీ నుంచి ఎవరో ఒకరు బరిలో దిగే అవకాశం ఉందా? లేదా? ఓ వేళ ఉంటే వారిద్దరలో ఎవరోఒకరు.. ఏ పార్టీ నుంచి అంటే.. కాంగ్రెస్ పార్టీ నుంచా లేకుంటే స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దినున్నారా? అన్న చర్చ తరాజకీయ వర్గాల్లో హల్‌చల్ చేస్తోంది. వైయస్ వివేకా హత్య జరిగి ఈ ఏడాది మార్చి 15వ తేదీకి అయిదేళ్లు పూర్తి చేసుకోంది. మరోవైపు మేము సిద్దం అంటూ సీఎం వైయస్ జగన్ బస్సు యాత్ర చేపట్టారు. అందులో భాగంగా తన సొంత చిన్నాన్న వైయస్ వివేకా హత్యపై ప్రొద్దుటూరు సభలో తొలిసారిగా వైయస్ జగన్ స్పందించారు. ఈ హత్య చేసింది ఎవరో తనకు, ఆ భగవంతుడికి తెలుసన్నారు. అలాగే తన సోదరిమణులిద్దరు అతడి వెనుకే ఉన్నారంటూ కీలక వ్యాఖ్యలు సైతం ఆయన చేశారు. మరోవైపు.. తన తండ్రి హత్య కేసులో సీఎం, సోదరుడు వైయస్ జగన్ వ్యవహరిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై సునీత నర్రెడ్డి తాజాగా మీడియా ముందుకు వచ్చి తీవ్రంగా స్పందించారు. అలాంటి వేళ వైయస్ వివేకా ఫ్యామిలీ ఈ ఎన్నికల బరిలో దిగుతుందా? లేదా? అనే ఓ సందేహం సర్వత్ర వ్యక్తమవుతోంది. ఇంకోవైపు ఏపీ పీసీసీ చీఫ్ వైయస్ షర్మిల పులివెందుల నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో దిగనున్నారనే ఓ ప్రచారం సైతం సాగుతుండగా.. కడప ఎంపీ స్థానం నుంచి వైయస్ షర్మిల పోటీ చేయనున్నారని.. అందుకోసం ఆమెపై పార్టీ అధిష్టానం తీవ్ర ఒత్తిడి తీసుకు వస్తుందనే ఓ ప్రచారం కూడా నడుస్తోంది. ఇక కడప లోక్‌సభ స్థానానికి ఫ్యాన్ పార్టీ అభ్యర్థిగా వైయస్ అవినాష్ రెడ్డి పేరుని ఇప్పటికే సీఎం వైయస్ జగన్ ప్రకటించారు. అయితే ఇదే అవినాష్ రెడ్డితోపాటు ఆయన తండ్రి వైయస్ భాస్కరరెడ్డిల పేర్లు వైయస్ వివేకా హత్యకేసులో ప్రమేయం ఉందంటూ తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అలాంటి సమయంలో వైయస్ అవినాష్ రెడ్డి ప్రత్యర్థిగా కడప లోక్‌సభ స్థానం నుంచి సునీత నర్రెడ్డి లేదా ఆమె తల్లి వైయస్ సౌభాగ్యమ్మ బరిలో దిగితే మాత్రం.. ప్రపంచంలోని తెలుగు ప్రజల దృష్టంతా ఆ నియోజకవర్గంపైనే ఉంటుందని ఓ చర్చ అయితే సదరు సర్కిల్‌లో నడుస్తోంది. అదీకాక.. ఈ ఎన్నికల్లో సునీత నర్రెడ్డి విజయం సాధిస్తే మాత్రం.. వైయస్ వివేకా హత్య కేసులో.. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే మాత్రం

# కాంగ్రెస్ లో అయోమయం..

హైదరాబాద్,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తరువాత ఏపీలో కాంగ్రెస్ పార్టీ ఉనికే నామమాత్రంగా మిగిలిపోయింది. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు గడిచినా ఆంధ్రప్రదేశ్ ప్రజలలో ఆ పార్టీ పట్ల ఆగ్రహం చల్లారిన దాఖలాలు కనిపించడం లేదు. రాష్ట్ర విభజన అనంతరం ఉభయ తెలుగు రాష్ట్రాలలోనూ అధికారాన్ని కోల్పోయిన కాంగ్రెస్.. తెలంగాణలో బలంగా పుంజుకుంది. అధికారపగ్గాలు చేపట్టింది. తెలంగాణ రాష్ట్రాన్ని తన పోరాటం ద్వారా సాధించానని చెప్పుకుంటూ తెలంగాణ పితగా తనకు తానే కితాబులిచ్చేసుకున్న కేసీఆర్ పార్టీని ఆ రాష్ట్ర ప్రజలు ప్రతిపక్షానికి పరిమితం చేసేశారు. తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ కు పట్టం కట్టారు. అయితే ఇది జరగడానికి పదేళ్లు పట్టింది.అయితే ఏపీలో మాత్రం అడ్డగోలు విభజన ఆగ్రహం ప్రజలలో ఇంకా చల్లారినట్లు కనిపించలేదు. ఈ నేపథ్యంలోనే దక్షిణాదిలో కర్నాటక, తెలంగాణలలో అధకారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏపీపై దృష్టి సారించింది. ఏపీలో పుంజుకోవాలంటే వైఎస్ బ్రాండ్ ను జగన్ నుంచి తమ పార్టీకి బదలాయించుకోవడమొక్కటే మార్గమని భావించింది. అందుకే వైఎస్ కుమార్తె వైఎస్ షర్మిలకు పార్టీ ఏపీ పగ్గాలు అప్పగించింది. షర్మిల అన్న జగన్ తో విభేదించి తెలంగాణలో తన తండ్రి పేరు మీద వైఎస్సార్టీపీ పార్టీని ఏర్పాటు చేసుకుని తన స్థాయిలో తాను రాజకీయం చేసుకున్నారు. అయితే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ముందు అనూహ్యంగా ఆమె కాంగ్రెస్ కు మద్దతుగా ఎన్నికలలో తన పార్టీని పోటీ నుంచి పక్కన పెట్టేశారు. ఆ తరువాత ఆమె పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేసి ఆ పార్టీ ఏపీ పగ్గాలు అందుకున్నారు. ఇలా ఏపీ కాంగ్రెస్ పగ్గాలు అందుకున్న షర్మిల అలా తన అన్నపై విమర్శల బాణాలు సంధించారు. దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్ మైలేజీ పెరిగిందని పరిశీలకులు సైతం విశ్లేషించారు. సూటిగా జగన్ పైనే విమర్శనాస్త్రాలు సంధిస్తూ, తన తండ్రి వైఎస్ ఆశయాల సాధన కోసమే తాను కాంగ్రెస్ లో చేరి ఆ పార్టీ ఏపీ పగ్గాలు పట్టుకున్నానని కూడా గట్టిగా చెప్పారు. అంతేనా సొంత బాబాయ్ వివేకా హత్య కేసు ఛేదనలోలో కూడా జగన్ దర్యాప్తు సంస్థలకు అడుగడుగునా అడ్డుపడింది కూడా జగనేనని ఆమె విస్పష్టంగా ప్రకటించేశారు. వివేకా 5వ వర్ధంతి సభలో వివేకా కుమార్తె సునీతతో కలిసి వేదిక పంచుకుని, ఆ వేదిక సాక్షిగా తన అన్నకు ఓటు వేయవద్దని ప్రజలకు పిలుపు కూడా ఇచ్చారు. తాను కడప లోక్ సభ, లేదా పులివెందుల అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తానని ప్రకటించారు. ఇందు కోసం ప్రజాభిప్రాయ సేకరణ అంటూ కడప నేతలతో సమావేశం కూడా ఏర్పాటు చేశారు. అంతే ఆ తరువాత నుంచీ ఆమె అనూహ్యంగా మౌనముద్ర వహించారు. అంతే కాదు బహిరంగంగా ఎక్కడా సభలు సమావేశాలలో కనిపించడం లేదు.ఒక పక్క ఎన్నికల షెడ్యూల్ విడుదలై అన్ని పార్టీలూ ప్రచారంలో పరుగులు పెడుతుంటే.. ఏపీ కాంగ్రెస్ లో మాత్రం ఎన్నికల హడావుడి ఏమీ కనిపించడం లేదు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కనిపించడం లేదు. వినిపించడం లేదు. దీంతో రాజకీయవర్గాలలోనే కాకుండా కాంగ్రెస్ శ్రేణులలో కూడా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. షర్మిల కాడె వదిలేశారా అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. సరిగ్గా ఈ సమయంలోనే ఇంత కాలం కుమారుడు జగన్ కు దూరంగా కుమార్తె షర్మిలతో ఉన్న వైఎస్ సతీమణి విజయమ్మ ఇడుపుల పాయలో జగన్ పక్కన ప్రత్యక్షమయ్యారు. జగన్ తన ఎన్నికల ప్రచార శంఖారావాన్ని ఇడుపులపాయ నుంచి బస్సుయాత్ర ద్వారా ప్రారంభించారు. ఆ సందర్భంగా ఇడుపులపాయలో ఏర్పాటు చేసిన సమావేశంలో విజయమ్మ పాల్గొన్నారు. కొడుకును బైబిల్ సాక్షిగా దీవించారు. దీంతో షర్మిల కూడా తన స్టాండ్ మార్చుకున్నారా అన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నారు. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలిగా పార్టీలో ఉత్సాహం కలిగించేలా వరుస సభలూ సమావేశాలతో దూసుకుపోవాల్సిన తరుణంలో షర్మిల సైలెంట్ కావడం, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపిక వంటి కార్యక్రమాలకు ఇంకా శ్రీకారం చుట్టకపోవడంతో తెరవెనుక ఏదైనా జరిగిందా అన్న సందేహాలు సర్వత్రా వ్యక్తమౌతున్నాయి. తల్లి విజయలక్ష్మిని తనకు అనుకూలంగా చేసుకున్న జగన్ చెల్లి షర్మిలను తన వైపు తిప్పుకున్నారా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వీటన్నిటినీ నివృత్తి చేయాల్సిన షర్మిల ఇకనైనా మౌనం వీడాల్సిన అవసరం ఉందని పరిశీలకులు అంటున్నారు?

# వేగంగా కొనసాగుతున్న మూల్యాంకనం

Telangana State Board of Intermediate Education

హైదరాబాద్, తెలంగాణ ఇంటర్మీడియెట్ పరీక్షలు పూర్తైన సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19 వరకు పరీక్షలు జరిగాయి. ఇక ఇప్పటికే ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం (స్పాట్ వాల్యుయేషన్) కూడా ప్రారంభమైంది. మూల్యాంకనం ప్రక్రియను ఇంటర్ బోర్డు మరింత కట్టుదిట్టంగా నిర్వహిస్తోంది. మూల్యాంకన కేంద్రాల్లో విధులకు హాజరయ్యే అధ్యాపకుల ఫోన్లను అనుమతించకూడదని ఇంటర్ బోర్డు ఆదేశించింది. కేంద్రాల్లోకి గతంలో ఫోన్లను అనుమతించడం వల్ల సమస్యలు తలెత్తాయని, ఆ సమస్యలు పునరావృతంకాకుండా వెంటనే స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాల్లోకి ప్రవేశించే ముందు అధ్యాపకులు తమ ఫోన్లను సెక్యూరిటీ గార్డులకు డిపాజిట్ చేయాలని బోర్డు సూచించింది. అలాగే పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం చేసే గదుల్లో సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేశారు. మూల్యాంకనం చేసే సమయంలో బయటి వ్యక్తులతో ఎలాంటి సంబంధాలకు తావు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు.మూల్యాంకనం చేసేందుకు సమాధాన పత్రాలు తీసుకున్నప్పటి నుంచి, తిరిగి సంబంధిత అధికారికి వాటిని ఇచ్చే వరకు హాలులోనే ఉండాలని సూచించింది. గదిని దాటి బయటకు వచ్చిన ప్రతిసారీ రిజిస్టర్‌లో నమోదు చేయాలని బోర్డు స్పష్టం చేసింది. విద్యార్థుల సమాధాన పత్రాల కోడింగ్ వ్యవస్థను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని, అక్రమాలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు బోర్డు తెలిపింది. అధ్యాపకులు పూర్తిచేసిన మూల్యాంకన పత్రాల వివరాలు ఎప్పటికప్పుడు రాష్ట్ర కార్యాలయానికి తరలించేలా ఏర్పాట్లు చేసినట్టు పేర్కొంది. ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు 10 లక్షలకు పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరీక్షల మూల్యాంకనం కోసం రాష్ట్రవ్యాప్తంగా 16 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 60 లక్షల పేపర్లు మూల్యాంకన కేంద్రాలకు చేరుకున్నాయి. వీటిని మూల్యాంకనం చేసేందుకు సబ్జెక్టుల వారీగా 20 వేల మంది అధ్యాపకులు ఈ ప్రక్రియలో నిమగ్నమయ్యారు.ఒక్కో అధ్యాపకుడు ఉదయం 15 పేపర్లు, సాయంత్రం 15 పేపర్లు చొప్పున.. రోజుకు కేవలం 30 పేపర్లు మాత్రమే మూల్యాంకనానికి ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు. నాణ్యమైన మూల్యాంకనం లక్ష్యంగా ఈ విధానాన్ని అవలంభిస్తున్నట్లు పరీక్షల విభాగం అధికారులు చెబుతున్నారు. మూల్యాకనం అనంతరం పది రకాలుగా పరీక్షించిన తర్వాతే ఆ మార్కులను ఆన్‌లైన్‌లో ఎంటర్ చేసేలా ఆదేశాలు జారీ చేశారు. ఒకరు పొరపడ్డా, మరో ఎగ్జామినర్ దాన్ని పరిశీలించి విద్యార్థి మార్కులు కోల్పోయే అవకాశం లేకుండా ఉండేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఏప్రిల్ రెండో వారానికల్లా స్పాట్ పూర్తి చేసి, సాంకేతిక లోపాలుంటే మూడో వారంలో సరిచేసి, నాల్గవ వారంలో ఫలితాలు వెల్లడించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఒకవేళ ఆలస్యమైతే మే మొదటి వారంలో ఫలితాలు వెల్లడించే అవకాశం ఉన్నట్లు స్పష్టం చేశారు.

# రేవంత్‌పై వసూళ్ల ఆరోపణలు

హైదరాబాద్,బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. సీఎం రేవంత్ రెడ్డి రూ. 2500 కోట్లు వసూలు చేసి కాంగ్రెస్ పెద్దలకు పంపారంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై హనుమకొండ పోలీసులకు కాంగ్రెస్ నేత బత్తిన శ్రీనివాస్ రావు ఫిర్యాదు చేశారు. అయితే హనుమకొండ పోలీసులు ఆ కేసును బంజారా హిల్స్ స్టేషన్‌కు అక్కడి పోలీసులు బదిలీ చేశారు. కేటీఆర్‌పై బంజారాహిల్స్ పోలీసులు ఐపీసీ 504,505(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తాజాగా సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ భవన్‌లో జరిగిన సికింద్రాబాద్ లోక్?సభ నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమా? బీజేపీ ప్రభుత్వమా? అని అర్థం కావడం లేదన్నారు. సామంత రాజులా రేవంత్ ఢిల్లీకి రూ.2500 కోట్లు కప్పం కట్టారని ఆరోపించారు.

# స్పీడ్‌గా సిట్ దర్యాప్తు...



హైదరాబాద్ : రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దర్యాప్తు వేగవంత మైం ది. ఈ కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. రో జుకో ట్విస్టు చోటు చేసుకుంటోంది. కేసులో కీలకంగా ఉ ండి, పరారీలో ఉన్న ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు సోమవారం హైదరాబాద్‌కు రానున్నట్లు సమాచారం. మరోవైపు ఈ కేసులో నిందితులైన పోలీస్ అధికారుల నేరాగీకారం, కస్టడీ రి పోర్టు ఆధారంగా గత బిఆర్ఎస్ ప్రభుత్వంలోని ప్రముఖ లీడర్లకు నోటీసులు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. సదరు నేతల్లో గత బిఆర్ఎస్ ప్రభుత్వంలోని ఇద్దరు మంత్రులు, ముగ్గురు ఎంఎల్ఎలు, ఇద్దరు ఎంఎల్‌సిలు ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు ఇప్పటికే న్యాయ సలహాలు తీసుకుంటున్నట్టు తెలిసింది. దర్యాప్తులో సేకరించిన నిందితుల కాల్‌డేటా, వాట్సాప్ చాటింగ్స్, ఫార్మా, రి యల్ ఎస్టేట్, ఐటి కంపెనీలకు చెందిన బాధితులు అందించిన సమాచారం ఆధారంగా సంబంధిత లీ డర్లకు నోటీసులు ఇవ్వనున్నారు. ఇందుకు ప్రణీత్‌రావు, టాస్క్‌ఫోర్స్ డిసిపి రాధాకిషన్‌రావు స్టేట్‌మెంట్ కీలకంగా మారినట్టు తెలిసింది. అధికార పార్టీకి చెందిన పలువురు నేతలు చెప్పిన విధంగా ఆపరేషన్స్ చేసినట్టు పోలీసు దర్యాప్తులో వీరిద్దరు వెల్లడించినట్టు సమాచారం. ఎస్ఐబి లాగర్ రూ మ్ నుంచి డిఎస్‌పి ప్రణీత్ రావు అందించిన ఫోన్‌నెంబర్స్, వాయిస్ రికార్డింగ్స్ ఆధారంగా గత ఎలక్షన్స్ సమయంలోరాధాకిషన్ రావు టీమ్ స్పెషల్ ఆపరేషన్స్ చేసిన సంగతి ఇప్పటికే వెల్లడైంది. ఇందులో అధికార పార్టీ మినహా ప్రధాన ప్రతిపక్ష పార్టీలకు చెందిన అభ్యర్థులు, నియోజకవర్గ ఇన్‌చార్జీలుగా ఉన్న కీలక నాయకుల డబ్బులను పట్టుకున్నారు. కంపెనీల అవసరాల కోసం బ్యాంకుల్లో డిపాజిట్ చేసేందుకు తీసుకెళ్తున్న డబ్బులను కూడా సీజ్ చేశారు. ముఖ్యనాయకుల అనుచరులు, ఆర్థిక వ్యవహారాలు చూసే సిబ్బంది ఫోన్లను ట్యాప్ చేశారు. డబ్బుతో ప్రయాణించే వారి వివరాలతో నిఘా పెట్టారు. స్పెషల్ ఆపరేషన్‌లో పట్టుకుని సీజ్ చేశారు. ఇలా స్వాధీనం చేసుకున్న డబ్బులో కొంతమాత్రమే లెక్కలు చూపేవారని ఆరోపణలు న్నాయి. పార్టీ ఫండ్, క్యాష్ ట్రాన్స్‌పోర్ట్ చేసేందుకే ఎస్ఐబి,టాస్క్‌ఫోర్స్, ఎస్వోటీ పోలీసులను వాడుకున్నారని పోలీస్ దర్యాప్తులో వెలుగు చూసినట్టు సమాచారం. ఫోన్ ట్యాపింగ్, బ్లాక్ మెయిలింగ్, బడా వ్యాపార వేత్తలు, ప్రముఖ కంపెనీలు, కాంట్రాక్టర్ల ద్వారా రూ.వందల కోట్లు ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేయించారని ప్రత్యేక దర్యాప్తు బృందం గుర్తించినట్టు సమాచారం. ఈ మేరకు నిందితులు తెలిపిన వివరాలతో బాండ్లు కొనుగోలు చేసిన వ్యక్తులు, కంపెనీల వివరాలను సేకరిస్తున్నట్టు తెలిసింది. ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేయడానికి గల కారణాలపై ఆరా తీస్తున్నట్టు సమాచారం. ఇందుకుగాను ఆయా సంస్థలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి లబ్ధి చేకూరిందనే కోణంలో పరిశోధన జరుగుతున్నది. ఈ క్రమంలోనే ప్రణీత్‌రావు, రాధాకిషన్‌రావు, భుజంగరావు, తిరుపతన్న స్టేట్‌మెంట్స్ ఆధారంగా సంబంధిత లీడర్లకు నోటీసులు ఇచ్చే అవకా శాలు ఉన్నట్టు సమాచారం. మునుగోడు, హుజూరాబాద్, దుబ్బాక ఉప ఎన్నికల సమయంలో ఎలక్షన్ కోడ్ అమల్లోకి రాకముందే ప్రణీత్‌రావు టీమ్ ఆపరేషన్స్ ప్రారంభించింది. గత ప్రభుత్వ పెద్దలు అందించిన ఫోన్ నెంబర్లు ట్యాప్ చేసి, టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అందించింది. దీంతో రాధాకిషన్ రావు టీమ్ ప్రతిపక్షపార్టీలకు చెందిన డబ్బు రవాణాను అడ్డుకు న్నారు. దీంతోపాటు హవాలా డబ్బును పెద్ద మొత్తంలో స్వాధీనం చేసుకున్నారు. అయితే, తనిఖీల్లో పట్టుబడ్డ డబ్బు చేతులు మారినట్టు సమా చారం. చాలా మంది హవాలా వ్యాపారులు ఎలాంటి కేసులు నమోదు చేయకుండా ఉండేందుకు అధికారులు అడిగినంత అప్పగించారని ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణలో వెలుగు చూసినట్టు తెలిసింది. వీటికి సంబంధించిన పూర్తి ఆధారాలను ప్రత్యేక దర్యాప్తు బృందం సేకరిస్తున్నట్టు సమాచారం. మరోవైపు తిరుపతన్న, భుజంగరావు వాడిన కంప్యూటర్స్, సెల్‌ఫోన్స్ ను అధికారులు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. సోమవారం నాంపల్లి కోర్టులో రాధాకిషన్ రావును వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలంటూ దర్యాప్తు బృందం పిటిషన్ వేయనుంది.

నా ఫోన్ ట్యాప్ చేసి రూ.కోట్లు వసూలు చేశారు  
రాధాకిషన్‌రావుపై రియల్ ఎస్టేట్ వ్యాపారి ఫిర్యాదు

ఫోన్ ట్యాపింగ్ కేసులో అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నల విచారణ మూడో రోజు కొనసాగింది. మరోవైపు తన ఫోన్ ట్యాప్ చేశారని రియల్ ఎస్టేట్ వ్యాపారి సంధ్యా శ్రీధర్ రావు బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో రాధాకిషన్‌రావుపై ఫిర్యాదు చేశారు. తన ఇంటికి వచ్చి రాధాకిషన్‌రావు రూ.కోట్లు తీసుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మరోవైపు అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపన్నల విచారణ మూడో రోజు కొనసాగింది. వారిద్దరూ ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా మరికొంత మందికి నోటీసు లిచ్చేం దుకు దర్యాప్తు బృందం సిద్ధమైనట్లు సమాచారం. ఇప్పటికే ఈ కేసులో నలుగురు పోలీసు ఉన్నతాధికారులు అరెస్టయ్యారు. తాజాగా ఇద్దరు అదనపు ఎస్పీల వాంగ్మూలం ఆధారంగా, మరికొంత మంది పేర్లు తెరపైకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. వెస్ట్ జోన్ డిసిపి విజయ్‌కుమార్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం కొనసాగిస్తున్న దర్యాప్తులో భాగంగా రాధాకిషన్‌రావుతో పాటు భుజంగరావు, తిరుపతన్నలు వెల్లడించిన వివరాలను పోలీసులు క్రాస్ చెక్ చేస్తున్నారు. ట్యాపింగ్ వ్యవహారం ఒక్కటే కాకుండా, టాస్క్‌ఫోర్స్‌లో సుదీర్ఘకాలం కీలకంగా ఉన్న రాధాకిషన్ రావుకు సంబంధించి మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చాయి. మరోవైపు ఫోన్ ట్యాపింగ్‌తో అక్రమంగా కోట్ల రూపాయలు కూడబెట్టారంటూ కొంతమంది బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు ఇచ్చేందుకు సిద్ధమైనట్లు తెలిసింది.

వ్యాపారినీ విచారించిన సిట్

టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్‌రావుపై ఫిర్యాదు చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారి సంధ్యా శ్రీధర్‌రావుని అధికారులు విచారించారు. న్యాయవాదితో కలిసి విచారణకు హాజరైన ఆయన వాంగ్మూలాన్ని ప్రత్యేక దర్యాప్తు బృందం రికార్డు చేసింది.

# బీజేపీ వాషింగ్ మెషీన్.. నాటి స్కామ్‌స్టర్లే నేడు స్టార్ క్యాంపెయినర్లు

న్యూఢిల్లీ, ప్రత్యర్థులుగా ఉన్నప్పుడు వారంతా అవినీతిపరులు. పార్టీలోకి వచ్చాక వారే ఆదర్శవంతులు. అవతలి పార్టీలో ఉంటే వారిపై నిందారోపణలు. కాషాయ కండువా కప్పుకున్నాక వారికే నీరాజనాలు. లోక్‌సభ ఎన్నికల వేళ బీజేపీ మార్క్ రాజకీయమిది. గతంలో అవినీతిపరులని ఆరోపించిన నేతలనే రెడ్‌కార్పెట్ పరిచి పార్టీలోకి చేర్చుకుంటున్నది. బీజేపీ కండువా కప్పేసి పునీతులను చేసేస్తున్నది. పార్టీ టికెట్లు కేటాయిస్తున్నది. ఆఖరికి పార్టీ తరఫున ప్రచారం చేసే స్టార్ క్యాంపెయినర్లను కూడా చేసేస్తున్నది. అజిత్ పవార్ మొదలుకొని నవీన్ జిందాల్ వరకు గతంలో బీజేపీ చేత అవినీతిపరులుగా ముద్ర వేయించుకున్న నేతలంతా ఇప్పుడు అదే పార్టీతో చేతులు కలిపారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో కీలక భూమిక పోషిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారం చూస్తున్న రాజకీయ విశ్లేషకులు బీజేపీని వాషింగ్ మెషీన్‌తో పోలుస్తున్నారు. ఎన్ని మరకలున్న దుస్తులైనా ఒకసారి వాషింగ్ మెషీన్‌లో వేస్తే శుభ్రమైనట్టు బీజేపీలో చేరిన నేతలు కూడా మంచి వారు అయిపోతున్నారా అంటూ ప్రశ్నిస్తున్నారు.

మహారాష్ట్ర బీజేపీ స్టార్ క్యాంపెయినర్‌గా అజిత్

ఎన్సీపీలో చీలిక తెచ్చి మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అయిన అజిత్ పవార్‌ను ఈ ఎన్నికల కోసం స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో బీజేపీ చేర్చింది. గతంలో ఆయనపై బీజేపీ అనేక ఆరోపణలు చేసింది. మహారాష్ట్ర స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్‌లో రూ.25 వేల కోట్ల కుంభకోణం కేసు కూడా ఆయనపై ఉండేది. అయితే, బీజేపీతో జట్టుకట్టిన తర్వాత ఈ కేసులో అజిత్ పవార్‌కు పోలీసు శాఖ క్లీన్‌చిట్ ఇచ్చింది. ఇప్పుడు అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీతో బీజేపీ పొత్తు పెట్టుకుంది. ఇదే ఎన్సీపీని 2014లో ప్రధాని మోదీ.. నేచురల్ కరప్షన్ పార్టీగా నిర్వచించారు.

మరో స్టార్ క్యాంపెయినర్ 'ఆదర్శ్' అశోక్ చవాన్

మహారాష్ట్రలోనే ఇటీవల బీజేపీలో చేరిన మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత అశోక్ చవాన్‌ను రాజ్యసభ సభ్యుడిని చేయడంతో పాటు పార్టీ స్టార్ క్యాంపెయినర్‌గా బీజేపీ నియమించింది. ఆదర్శ్ కుంభకోణంలో చవాన్ నిందితుడిగా ఉన్నారు. ఈ కేసును ఈడీ విచారిస్తున్నది. గతంలో అనేకసార్లు చవాన్‌ను బీజేపీ అవినీతిపరుడని విమర్శించింది. 2014లోనైతే చవాన్‌కు టికెట్ ఇచ్చిన కాంగ్రెస్‌కు సిగ్గులేదని మోదీ నిందించారు.

కండువా కప్పుకోగానే నవీన్ జిందాల్‌కు టికెట్

ఇటీవల కాంగ్రెస్ మాజీ ఎంపీ, పారిశ్రామికవేత్త నవీన్ జిందాల్ బీజేపీలో చేరగా, గంటల వ్యవధిలోనే ఆయనకు కురుక్షేత్ర ఎంపీ టికెట్ ఇచ్చారు. జార?ండ్, మధ్యప్రదేశ్‌లో బొగ్గు గనుల కేటాయింపుల్లో అక్రమాల ఆరోపణలు నవీన్‌పై ఉన్నాయి. సీబీఐ, ఈడీ కూడా విచారించింది. ఈ బొగ్గు గనుల



కుంభకోణానికి సంబంధించి మోదీ గతంలో అనేక ఆరోపణలు చేశారు. జార?ండ్ గనులు లూటీ కాకుండా చేస్తానని ఆయన ప్రకటించారు.

గీతా కొడాకు కండువా కప్పేశారు

బొగ్గు గనుల కేటాయింపు కుంభకోణంలో అవినీతి ఆరోపణలపై జైలు శిక్ష అనుభవించిన జార?ండ్ మాజీ ముఖ్యమంత్రి మధు కోడా భార్య గీతా కోడాను ఇటీవల పార్టీలో చేర్చుకుంది బీజేపీ. ఆమెకు సింఘ్‌భుమ్ లోక్‌సభ టికెట్ ఇచ్చింది. గీతా కోడా 2018లో కాంగ్రెస్‌లో చేరినప్పుడు బీజేపీ నేతలు కాంగ్రెస్‌పై అనేక విమర్శలు చేశారు. అవినీతిని వ్యవస్థీకృతం చేస్తున్నారని, మధు కోడా చేసిన కుంభకోణంలో కాంగ్రెస్ నేతలకూ పాత్ర ఉన్నదని ఆరోపించారు.

'దొంగ' అన్న నేతకే టికెట్

పశ్చిమ బెంగాల్‌కు చెందిన తృణమూల్ కాంగ్రెస్ సీనియర్ నేత తపస్ రాయ్‌ను ఇటీవల బీజేపీలో చేర్చుకుని కోల్‌కతా నార్త్ ఎంపీ టికెట్ ఇచ్చారు. మున్సిపాలిటీ ఉద్యోగ నియామకాల్లో అక్రమాల ఆరోపణలపై ఆయనపై ఈడీ విచారణ జరిపింది. ఆ సమయంలో బెంగాల్ బీజేపీ కీలక నేత సువేంధు అధికారి.. తపస్ రాయ్‌ను 'దొంగ' అని విమర్శించారు. ఇలా చెప్పుకుంటూ పోతే అవినీతి ఆరోపణలు ఉన్న, సీబీఐ, ఈడీ, ఐటీ తదితర దర్యాప్తు సంస్థల విచారణ ఎదుర్కొన్న ఎంతో మంది నేతలను పార్టీలోకి చేర్చుకొని మంచి ప్రాధాన్యం ఇస్తున్నది బీజేపీ.

మళ్లీ బీజేపీలోకి 'గాలి'

బీజేపీ నేతగా ఉంటూనే అక్రమ మైనింగ్‌కు పాల్పడిన కేసులో ఇరుక్కొని జైలుకు వెళ్లొచ్చిన కర్ణాటక నేత, ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డిని కొంతకాలం బీజేపీ పక్కనపెట్టింది. ఆయన సోదరులకు మాత్రం టికెట్లు ఇచ్చింది. దీంతో బీజేపీపై కోపంతో గాలి జనార్ధన్‌రెడ్డి సొంత పార్టీ పెట్టుకొని గత అసెంబ్లీ ఎన్నికల్లో బళ్లారి, బాగల్‌కోట్, కొప్పాళ జిల్లాలో బీజేపీకి నష్టం చేశారు. దీంతో ఈ లోక్‌సభ ఎన్నికల్లో మరోసారి నష్టం జరగకుండా ఆయనను మళ్లీ బీజేపీలో చేర్చుకున్నారు.

# పార్లమెంట్ నియోజకవర్గాలకు కాంగ్రెస్ ఇన్ ఛార్జీలు

హైదరాబాద్ : పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలోని 17 పార్లమెంటు నియోజకవర్గాలకు ఇంచార్జీలను నియమించింది. పార్టీ రా ష్ట్ర ఇంచార్జి, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి దీపా దాస్ మున్షీ పార్లమెంటు వారిగా ఇంచార్జీలను నియమిస్తూ ఆదివారం ఉత్తర్వు లు జారీ చేశారు. వారిలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి(ఖమ్మం), ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి (నల్గొండ), పొన్నం ప్రభాకర్ (కరీంనగర్), దుద్దిళ్ళ శ్రీధర్ బాబు (పెద్దపల్లి), రేవూరి ప్రకాశ్ రెడ్డి (వరంగల్), తుమ్మల నాగేశ్వరరావు (మహబూబాబాద్),ఒబేదుల్లా కోత్వాల్ (హైదరాబాద్),కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి (సికింద్రాబాద్) , కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి (భువనగిరి), జూపల్లి కృష్ణారావు (నాగర్‌కర్నూల్), ఎస్.ఎ.సంపత్ కుమార్ (మహబూబ్‌నగర్), వేంనరేందర్ రెడ్డి (చేవెళ్ల), మైనంపల్లి హనుమంతరావు (మల్కాజ్‌గిరి), కొండా సురేఖ (మెదక్), పి.సుదర్శన్ రెడ్డి (నిజామాబాద్), డి.అనుసూయ సీతక్క (ఆదిలాబాద్),దామోదర్ రాజనర్సింహా (జహీరాబాద్)లను నియమిం చారు. అయితే తొమ్మిది నియోజకవర్గాలకు ఎఐసిసి



ఇన్‌చార్జిగా రోహిత్ చౌదరి, మరో ఎనిమిది నియోజకవర్గాలకు ఇన్‌చార్జిగా పిసి విష్ణునాథ్ వ్యవహరించనున్నారు.

# కాంగ్రెస్ గూటికి కడియం శ్రీహరి,కావ్య



హైదరాబాద్:బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కూతురు, వరంగల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్సీ బి.మోహన్‌రెడ్డి కూడా కాంగ్రెస్ గూటికి చేరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆదివారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి వారు చేరుకున్నారు. సీఎం, దీపాదాస్‌మున్షితో చర్చించిన తర్వాత వారు కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. అనంతరం కడియం శ్రీహరి మాట్లాడుతూ తొలిసారిగా ఎన్నికల బరిలోకి దిగుతున్న తన కూతుర్ని ఓడిపోయే పార్టీ తరఫున పోటీ చేయించదలచుకోలేదన్నారు. అందుకే పార్టీ మారుతున్నట్టు తెలిపారు. వరంగల్ పార్లమెంటు నియోజక వర్గం నుంచి పోటీ కోసం కాంగ్రెస్ పార్టీ నుంచి పిలుపు వచ్చిందనీ, ఏఐసీసీ ప్రతినిధులు తమ నివాసానికి వచ్చి పార్టీలోకి ఆహ్వానించారని గుర్తు చేశారు. అయితే నియోజకవర్గ నేతలు, కార్యకర్తలను అడిగిన తర్వాతే తమ నిర్ణయాన్ని చెబుతానని వారికి చెప్పానన్నారు. వరంగల్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థిగా కావ్య పోటీ చేయనున్నట్టు ఆయన తెలిపారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ ఒడిదుడుకులు ఎదుర్కొంటోందనీ, నాయకులు అయోమయంలో ఉన్నారని వివరించారు. మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ వద్దంటేనే కడియం కావ్యకు వరంగల్ టికెట్ ఇచ్చారన్నారు. పదేండ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నా.. తన వెంట ఉన్న నాయకులు, కార్యకర్తలు ప్రతిపక్షంలో ఉన్నట్టుగానే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడేమో అధికారం లేక ప్రతిపక్షంలో ఉన్నామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎవరికీ అన్యాయం చేయలేదనీ, కానీ తాటికొండ రాజయ్య, ఆరూరి రమేశ్, పసునూరి దయాకర్ పార్టీ మారినప్పుడు ఎవరూ మాట్లాడలేదన్నారు. ఇప్పుడు మాత్రం అందరూ మాట్లాడుతున్నారని తెలిపారు. కొంత మంది నెలల తరబడి పార్టీలో చేరతామని కాంగ్రెస్ వారి ఇండ్ల చుట్టూ తిరిగినా వారు చేర్చుకోలేదన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఎలాంటి అవినీతి, అక్రమాలకు పాల్పడలేదనీ, రియల్ ఎస్టేట్, భూకబ్జాలు చేయలేదని చెప్పారు. ప్రయివేటు యూనివర్సిటీలు పెట్టుకోలేదని అన్నారు. తనను విమర్శించే నైతిక అర్హత ఏ ఒక్కరికీ లేదని స్పష్టం చేశారు. తన 30 ఏండ్ల రాజకీయ జీవితంలో తనపై ఒక్క కేసు కూడా లేదన్నారు. చాలా మంది పార్టీని, ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకొని విచ్చలవిడిగా ఆస్తులు కూడబెట్టుకున్నారని తెలిపారు. తనను ఆశీ ర్వదించినట్టే తన బిడ్డను ఆశీర్వదించాలని ప్రజలను కడియం విజ్ఞప్తి చేశారు.

## బెంగాల్‌లో తుపాను బీభత్సం.. ఐదుగురు మృతి

హైదరాబాద్ : పశ్చిమ బెంగాల్‌లోని జల్పాయ్‌గురిలో ఆకస్మిక తుఫాను విధ్వంసం సృష్టించింది. తుఫాన్ ధాటికి ఐదుగురు చనిపోగా, సుమారు 300 మందికిపైగా గాయపడ్డారు. 800కుపైగా ఇండ్లు నేలమట్టమయ్యాయి. బలమైన గాలులు వీయడంతో పలు చోట్ల చెట్లు కూలపోగా, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. రాజర్‌హత్, బర్నిష్, బకాలీ, జోర్పక్డి, మధబ్డంగా, సప్తిబరి ప్రాంతాల్లో తుపాను తీవ్ర ప్రభావం అధికాగా ఉందని అధికారులు వెల్లడించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సీఎం మమతా బెనర్జీ పర్యటించారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. తుఫాను కారణంగా ఏ మేర నష్టం జరిగిందో అనేదానిపై ఒక

# మోదీని ఢీకొట్టి ఇండియా కూటమి నిలబడగలదా?




న్యూఢిల్లీ, జనరల్ ఎలక్షన్ పోరు జెట్ స్పీడ్‌తో కొనసాగుతోంది. ఫస్ట్ ఫేజ్ ఎన్నికలకు ఇప్పటికే 102 లోక్‌సభ స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. సెకండ్ ఫేజ్ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కంటిన్యూ అవుతోంది. అయినా ఇప్పటికీ ఇండియా కూటమిలో సీట్ల సర్దుబాటు కొలిక్కి రావడం లేదు. బీహార్‌లో ఆర్జేడీ–కాంగ్రెస్–వామపక్షాల మధ్య సీట్ల సర్దుబాటుపై రెండ్రోజుల క్రితమే క్లారిటీకి వచ్చారు. మరోవైపు మహారాష్ట్రలో మాత్రం ఇండియా కూటమిలోని భాగస్వామ్య పార్టీల మధ్య సీట్ల పంపకం విషయంలో సస్పెన్స్ కొనసాగుతోంది. జయంత్ చౌదరి నేతృత్వంలోని RLD ఇండియా కూటమి నుండి విడిపోయి NDAలో చేరింది. జేడీయూ–ఆర్ఎల్‌డీ ఎన్డీయేలో చేరడం ప్రతిపక్ష కూటమికి పెద్ద దెబ్బ. జమ్మూకాశ్మీర్‌లో మెహబూబా ముఫ్తీ పార్టీ పీడీపీ ఒంటరిగా ఎన్నికల్లో పోటీ చేస్తుండగా, బెంగాల్‌లో టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ కూడా ఒంటరిగా వెళ్తున్నారు. సీట్ల పంపకం విషయంలో ఉత్తరప్రదేశ్‌లో ఎస్పీ, బీహార్‌లో ఆర్జేడీ పెట్టిన షరతులకు కాంగ్రెస్ అంగీకరించాల్సి వచ్చింది. 80 సీట్లు ఉన్న యూపీలో కాంగ్రెస్ 17 సీట్లలోనే పోటీ చేస్తుంది.

పొత్తులపై కాంగ్రెస్‌కు షాక్

సింగిల్‌గా మోదీని ఢీకొట్టి అధికారంలోకి రాలేమని భావించిన కాంగ్రెస్.. పొత్తులతో ఎన్నికల బరిలోకి దిగుతోంది. ఇండియా కూటమిగా 20కి పైగా పార్టీలను కలుపుకుని ముందుకెళ్తుంది. అయితే పొత్తులపై కాంగ్రెస్‌కు షాక్ ఇస్తూ వస్తున్నాయి పలు పార్టీలు. సీట్ల సర్దుబాటులో లెక్కలు కుదరక ఇండియా కూటమికి గుడ్ బై చెప్పేశారు పశ్చిమబెంగాల్ సీఎం మమత బెనర్జీ. ఇక కూటమి ఏర్పాటుకు ముందుండి నడిచిన బిహార్ సీఎం నితీష్ కుమార్ టైమ్ చూసి కాంగ్రెస్‌కు హ్యాండ్ ఇచ్చి.. ఎన్డీయేతో దోస్తీ షురూ చేశారు.

కాంగ్రెస్‌కు కష్టాలు

కూటమి కథ అట్లుంటే కాంగ్రెస్‌ను కష్టాలు వెంటాడుతున్నాయి. ఓ వైపు ఆర్థిక కష్టాలు.. మరోవైపు కేసులు హస్తం పార్టీని చుట్టుముట్టాయి. వరుస ఐటీ నోటీసులు, అకౌంట్ల ఫ్రీజ్.. ఎన్నికల వేళ కాంగ్రెస్‌ను ఆర్థికంగా ఇబ్బందిపెడుతు న్నాయి. లేటెస్ట్ గా 3వేల 5వందల కోట్ల రూపాయల పన్ను రికవరీ కోసం కాంగ్రెస్‌కు ఐటీ నోటీసులు ఇచ్చింది. అంతకుముందు 18 వందల 23 కోట్లకు సమన్లు ఇచ్చారు. దానికంటే ముందు అకౌంట్లలో అమౌంట్ ఫ్రీజ్ చేసింది ఐటీ. ఈ ఇష్యూపై కోర్టులు, ఐటీ ట్రైబ్యునల్‌కు వెళ్లినా న్యాయం జరగడం లేదని ఏఐసీసీ అగ్రనేతలు ప్రెస్ మీట్ పెట్టి చెప్పినా పట్టించుకున్న నాథుడే లేడు. ఇండియా కూటమిలోని ఏ పార్టీ ఈ విషయంలో కాంగ్రెస్‌కు అండగా నిల్వలేదు. ప్రెస్‌మీట్లు పెట్టడం వరకే పరిమితం అవడం తప్ప ప్రత్యేక కార్యాచరణ తీసుకున్నది మాత్రం ఏం లేదు.

వెంటాడుతున్న ఈడీ, సీబీఐ కేసులు


ఇండియా కూటమిలో కాంగ్రెస్‌తో నడుస్తున్న ఆప్ పార్టీని ఈడీ, సీబీఐ కేసులు వెంటాడుతున్నాయి. ఆమ్ ఆద్మీ పార్టీతో ఢిల్లీ–గుజరాత్–హర్యానాలో సీట్ల షేరింగ్‌తో పోటీ చేస్తోంది కాంగ్రెస్. కేజ్రీవాల్ క్లీన్ ఇమేజ్ కలసి వస్తుందని భావించిన కాంగ్రెస్‌కు పెద్దషాకే తగిలింది. ఢిల్లీ సీఎం, ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ అరెస్ట్ అయి జైల్‌లో ఉన్నారు. ఆ పార్టీ ప్రముఖ నేతలపై అవినీతి ఆరోపణలు, కేసులు కాంగ్రెస్‌కు ప్రతికూల అంశాలనే చెప్పొచ్చు. అవినీతిరహిత పాలన పేరుతో ఢిల్లీ, పంజాబ్‌లో పాగా వేసిన ఆప్.. ఇండియా కూటమి అధికారంలో రావడానికి కీలక పాత్ర పోషిస్తుందని భావించారంతా. కానీ సీన్ రివర్స్ అయింది. కేజ్రీవాల్ జైలుకు వెళ్లారు.

మహారాష్ట్రలోనూ ముసలం

ఇక కేరళలో సీఎం విజయన్ నేతృత్వంలోని ఎల్డీఎఫ్, కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ ప్రత్యర్థులుగా ఉన్నాయి. మహారాష్ట్రలోనూ ముసలం మొదలైంది. సీట్ల సర్దుబాటుపై చర్చలు జరుగుతుండగానే, ముంబై నార్త్ వెస్ట్ సీటుకు శివసేన ఉద్ధవ్ వర్గం అభ్యర్థిని ప్రకటించడంపై కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. మరోవైపు జార?ండ్‌లో 14 సీట్లకు గాను 8 స్థానాల్లో ఒంటరిగానే పోటీచేస్తామని సీపీఐ ప్రకటించింది. త్యాగాలు చేసి.. సొంతపార్టీ నేతలకు టికెట్లు ఇవ్వకుండా పొత్తులతో ఎన్నికలకు వెళ్తుంది కాంగ్రెస్. ఎంత కాంప్రమైజింగ్‌కు వెళ్లినా కూటమి పార్టీలు కాంగ్రెస్‌తో సీట్ల షేరింగ్‌పై పట్టువదలడం లేదు కూటమి పార్టీలు. నామినేషన్లు స్టార్ట్ అయినా సీట్ల సర్దుబాటు కొలిక్కి రాలేదు. అభ్యర్థులు ఎవరో తేల్చుకోలేకపోతుంది ఇండియా కూటమి.

# దంచికొడుతున్న ఎండలు.. 15 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

హైదరాబాద్,నేటి నుంచి తెలంగాణ ప్రజలకు అలర్ట్ ఉండాలని ఐఎండీ హెచ్చరించింది. తెలంగాణ రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు.. క్రమంగా పెరుగుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సగటున 40 డిగ్రీల పైనే నమోదవుతున్నాయి ఉష్ణోగ్రతలు. ఏప్రిల్ మొదటి వారం నుంచి మరింత ఉష్ణోగ్రతలు పెరుగుతాయని ఐఎండీ.. పేర్కొంది. తెలంగాణలోని 15 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది ఐఎండీ. ఇవాళ ఉదయం నుంచే ఉక్కపోత వాతావరణం..మొదలైంది. దీంతో రాబోయే ఐదు రోజుల పాటు మరింత తీవ్రంగా ఉష్ణోగ్రతలు ఉండనున్నాయట. దీంతో రాబోయే ఐదు రోజుల పాటు బయటకు రాకుండదని ప్రజలకు వార్నింగ్ ఇచ్చింది హైదరాబాద్ వాతావరణ కేంద్రం. ఉత్తర తెలంగాణ జిల్లాలకు అధికంగా వడగాడ్పుల ముప్పు ఉంటుందని హెచ్చరించింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబ్ నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల, నాగర్ కర్నూల్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. నేటి నుంచి కొన్ని జిల్లాల్లో 3 నుంచి 4 డిగ్రీల మేర



పెరగనున్నాయి ఉష్ణోగ్రతలు..సాధారణం కంటే అధికంగా నమోదవుతున్నాయి రాత్రిపూట ఉష్ణోగ్రతలు. ఎండల తీవ్రతతో ప్రజలు అవసరమైతేనే బయటకు రావాలని హెచ్చరించింది ఐఎండీ.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com